teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు...
తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 03 | సంచిక : 167 | ఛీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | శుక్రవారం | 11 అక్టోబర్ 2024 | పేజీలు : 08 | వెల ‘ 5

Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar,Nizamabad, Adilabad.

## రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు

### మహాత్మాగాంధీ స్మారక నిధి స్థలాన్ని సవాల్ చేస్తూ వాజ్యం




హైదరాబాద్, అక్టోబర్ 10 (తీన్మార్ న్యూస్): హైదరాబాద్ కోఠిలోని మహాత్మాగాంధీ స్మారక నిధికి చెందిన 5.34 ఎకరాలను ప్రైవేట్ వ్యక్తుల పేరిట రిజిస్ట్రేషన్ చేయడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యంలో రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. పూర్తి వివరాలతో ఆరు వారాల్లోగా కౌంటర్లు దాఖలు చేయాలని ప్రతి వాదులైన సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి, రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి, భూపరిపాలన ప్రధాన కమిషనర్, సిద్దిపేట జిల్లా కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్ మరికొందరిని ఆదేశించింది. సిద్ధిపేట జిల్లా సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల గ్రామంలోని గాంధీ స్మారక నిధికి చెందిన భూమి అన్యాక్రాంతమైందంటూ గ్రామానికి చెందిన తు- పాకుల బాలరంగం తదితరులు ఈ పిటిషన్ వేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో 2022 ఆగస్టు 6న చట్ట వ్యతిరేకంగా చేసిన ఆ రిజిస్ట్రేషను రద్దు చేయాలని కోరారు.



# ఊరూవాడా సద్దుల బతుకమ్మ సంబరాలు



## ట్యాంక్‌బండ్‌పై వైభవంగా బతుకమ్మ సంబరం

### పలు జిల్లాల్లో వేడుకగా సాగిన ఉత్సవాలు

తెలంగాణ సంస్కృతికి అద్దంపట్టే బతుకమ్మ వేడుకలు రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. చివరి రోజు సద్దుల బతుకమ్మ సందర్భంగా మహిళలంతా ఒక్కచోట చేరి ఆడిపాడుతూ సంబురాలు చేసుకున్నారు. మహిళలంతా తీరొక్క పువ్వులతో భక్తి శ్రద్ధలతో బతుకమ్మను పేర్చారు. బతుకమ్మ సంబురాలతో హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్ పరిసరాలు వెలుగులీనాయి.

హైదరాబాద్, అక్టోబర్ 10 (తీన్మార్ న్యూస్): వేలాదిమందితో బతుకమ్మ ర్యాలీ నిర్వహించారు. అలాగే ట్యాంక్ బండ్ పరిసరాలు మహిళల సందడితో కళకళ లాడింది. ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. సిఎం రేవంత్ రెడ్డి, డిప్యూడి సిఎం మల్లు భట్టి విక్రమార్కలు సంబురాలకు హాజరయ్యారు. వందలాది మంది మహిళలు 'బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో' అంటూ ఆడిపాడారు. వేలాది మంది

మిగతా 2 లో



### అర్హులైన మిగతా రైతులందరికీ వారంలో రుణమాఫీ

రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

.. వివరాలు 2లో



### మంత్రి కొండా సురేఖపై కేటీఆర్ పరువు నష్టం పిటిషన్ దాఖలు

సురేఖపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని న్యాయవాది వినతి

పిటిషన్‌పై నాంపల్లి కోర్టులో విచారణ

.. వివరాలు 2లో

### ఈ నెల 14 నుంచి గ్రూప్-1 మెయిన్స్ హాల్‌టికెట్లు

పబ్లిక్ సర్వీస్ కమిషన్ వెల్లడి

.. వివరాలు 2లో



# బిల్డింగులు కట్టేవారు నోటీసు బోర్డులు పెట్టాలి

### కొత్త రూల్ పెట్టిన హెచ్ఎండీఏ

అపార్ట్‌మెంట్లు, హైరైజ్ బిల్డింగులు కట్టేవారు ఇక నుంచి సదరు నిర్మాణాల వివరాలను తెలియజేసేలా నోటీసు బోర్డులు పెట్టాలని హెచ్ఎండీఏ కొత్త రూల్‌పెట్టింది. అనుమతుల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి పర్మిషన్ ఇచ్చే సమయంలో ఈ కొత్త నిబంధన విధిస్తోంది.

హైదరాబాద్, అక్టోబర్ 10 (తీన్మార్ న్యూస్): హైడ్రా ఎంట్రీతో అనుమతుల జారీ విషయంలో హెచ్ఎండీఏ ఆచితూచి వ్యవహరిస్తోంది. గతంలో ఎన్ఓసీని రెవెన్యూ, ఇరిగేషన్‌శాఖల నుంచి తీసుకురావాలని చెప్పగా, తర్వాత

మిగతా 2 లో



## అమ్రపాలికి కేంద్ర సిబ్బంది వ్యవహారాల శాఖ షాక్

### తెలంగాణ క్యాడర్లోనే కొనసాగించాలన్న దరఖాస్తు తిరస్కరణ

### ఆంధ్రప్రదేశ్ క్యాడర్లో జాయినవ్వాలని ఉత్తర్వులు

గ్రేటర్ హైదరాబాద్ కమిషనర్ పోస్టుతోపాటు పలు కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న ఐఏఎస్ అధికారిణి కాటా అమ్రపాలికి కేంద్ర సిబ్బంది వ్యవహారాల మంత్రిత్వ శాఖ షాక్ ఇచ్చింది. తనను తెలంగాణ క్యాడర్లోనే కొనసాగించాలని పెట్టుకున్న దరఖాస్తును తిరస్కరించింది.

హైదరాబాద్, అక్టోబర్ 10 (తీన్మార్ న్యూస్):ఆమెను విభజన సమయంలో ఆంధ్రప్రదేశ్ కు కేటాయిచారు. ఆంధ్రప్రదేశ్ క్యాడర్లో జాయినవ్వాలని ఉత్తర్వులు జారీ చేసింది. 2010 బ్యాచ్ కు చెందిన ఐఏఎస్ అధికారిణి అయిన అమ్రపాలి తనను తెలంగాణ స్థానికత ఉన్న అధికారిగా గుర్తించాలని చేసిన విజ్ఞప్తిని తోసి పుచ్చారు. ఖండేకర్ కమిటీ చేసిన సిఫారసుల ఆధారంగా ఆమె ఆంధ్రప్రదేశ్ క్యాడర్కే

మిగతా 2 లో



## హైదరాబాద్‌లో సుప్రీంకోర్టు బెంచ్‌ను ఏర్పాటు చేయాలి

### కేంద్ర ప్రభుత్వాన్ని కోరిన అడ్వకేట్ జేఏసీ అధ్యక్షులు

హైదరాబాద్, అక్టోబర్ 10 (తీన్మార్ న్యూస్): సుప్రీంకోర్టు సౌత్ ఇండియా రీజినల్ బెంచ్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేయాలని దక్షిణ భారత అడ్వకేట్ జేఏసీ అధ్యక్షుడు సుధా నాగేందర్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఇదే డిమాండ్‌తో దక్షిణ భారత అడ్వకేట్ జేఏసీ ఆధ్వర్యంలో ఎన్నో ఏళ్లుగా పోరాటం చేస్తున్నా పాలకులు మాత్రం పట్టించుకోవడం లేదని ఆయన ఆరోపించారు. బుధవారం నల్లకుంటలోని కార్యాలయంలో సుప్రీంకోర్టు న్యాయవాది

మిగతా 2 లో

### ఈనెల 20న కేబీఆర్ పార్కులో

## ప్రజా సంబురాలు



హైదరాబాద్, అక్టోబర్ 10 (తీన్మార్ న్యూస్): ప్రజా పాలనలో భాగంగా మన సంస్కృతి, వారసత్వ సంపద తెలిసేలా ఈనెల 20న కేబీఆర్ పార్కులో ప్రజా సంబురాలను నిర్వహిస్తున్నామని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి తెలిపారు. ఖైరతాబాద్‌లోని జీహెచ్ఎంసీ కార్యాలయంలో బుధవారం ప్రజా సంబురాల నిర్వహణ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా

మిగతా 2 లో

## రిటర్న్ జర్నీలో బస్సులు ఖాళీ.. చార్జీలు పెంపు తప్పదు

### ఈనెల 14వరకు అందుబాటులో అదనపు బస్సులు

హైదరాబాద్, అక్టోబర్ 10 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో దసరా పండుగ సందర్భంగా టీజీఎస్ఆర్టీసీ 6300 బస్సులను నడుపుతున్నట్టు ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ తెలిపారు. ఇదే సమయంలో స్పెషల్ బస్సుల్లో అదనపు

మిగతా 2 లో



## హైదరాబాద్ వ్యాప్తంగా భారీ వర్షం

### సద్దుల బతుకమ్మ ఆడుకోవడనికి వెళ్లే వారికి ఇబ్బందులు

హైదరాబాద్, అక్టోబర్ 10 (తీన్మార్ న్యూస్): హైదరాబాద్ వ్యాప్తంగా భారీ వర్షం పడుతుంది. మధ్యాహ్నం ఎండగా ఉన్నప్పటికీ ఉన్నట్టుండి ఒక్కసారిగా వాతావరణం మారింది. మేఘాలు నల్లగా

మిగతా 2 లో



## పండగ వేళ రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం తీపికబురు

### అక్టోబర్ నెలలో చెల్లించాల్సిన పన్నుల వాటా విడుదల

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 10 (తీన్మార్ న్యూస్): పండగ వేళ రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం తీపికబురు చెప్పింది. రాష్ట్రాలకు అక్టోబర్ నెలలో

మిగతా 2 లో



# ఊరూవాడా సద్దుల బతుకమ్మ సంబరాలు

మొదటి పేజీ తరువాయి

మహిళలతో హనుమకొండ పద్మాక్షి అమ్మవారి గుండం కిక్కిరిసిపోయింది. వికారాబాద్ జిల్లా తాండూరులో మహిళలు భక్తి శ్రద్ధలతో బతుకమ్మ ఆడారు. కరీంనగర్, నల్గొండ, అదిలాబాద్ తదితర జిల్లాల్లో బతుకమ్మ సంబరాలు కోలాహలంగా సాగుతున్నాయి. తొలిరోజు ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభమైన ఈ సంబురాలు నేటితో ముగిసాయి. తెలంగాణ వ్యాప్తంగా బతుకమ్మ సంబురాలు అంబరాన్నంటాయి. గురువారం చివరి రోజైన సద్దుల బతుకమ్మ కావడంతో తెలంగాణ గల్లీగల్లీ నుంచి హైదరాబాద్ బస్తీల వరకు వేడుకలు ఆకాశాన్ని అంటాయి. ఇటు ట్యాంక్‌బండ్ పరిసరాల్లో మంత్రి సీతక్క సహ పలువురు మహిళ నేతలు, మహిళలు, యువతులు పెద్ద ఎత్తున తరలివచ్చి బతుకమ్మ సంబరాల్లో పాల్గొనగా.. మరోపక్క ఊరూవాడా పూలవనంలా మారిపోయింది. మహిళలు, యువతులు, చిన్నారుల ఆటపాటలతో రాష్ట్ర వ్యాప్తంగా సందడి వాతావరణం నెలకొంది. అక్టోబర్ 2న ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభమైన ఉత్సవాలు సద్దుల బతుకమ్మతో ముగుస్తున్నాయి. రాష్ట్ర ఆవిర్భావం నుంచే బతుకమ్మ సంబురాలను ప్రభుత్వం ఘనంగా నిర్వహిస్తోంది. దీంతోపాటు బతుకమ్మను రాష్ట్ర పండుగగా గుర్తించి గౌరవించింది. బతుకమ్మల నిమజ్జనానికి ఊళ్లలో ఉండే చెరువులతో పాటు హైదరాబాద్ వాసులు తమ సమీప నీటి వనరులను ఉపయోగించుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మరోవైపు రాజ్‌భవన్‌లో జరిగిన బతుకమ్మ వేడుకల్లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, సతీమణి సుధాదేవ్ పాల్గొన్నారు. గవర్నర్‌గా నియమితులైన తర్వాత తొలిసారి సంబురాలు జరుపుకుంటుండడంతో పూల పండుగ విశిష్టతను అధికారులు గవర్నర్ దంపతులకు అధికారులు వివరించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ మనకు పూర్వీకులు ఇచ్చిన గొప్ప ఆచారం, సంస్కృతీ బతుకమ్మ అన్నారు. భవిష్యత్ తరాలకు ఈ పండుగను అందించడమే మన బాధ్యత అని, చెరువులను కబ్జాలు కాకుండా కాపాడుకుందామని మంత్రి సీతక్క పిలుపునిచ్చారు. ఈ రోజు చెరువులు కనుమరుగయ్యే పరిస్థితి నెలకొందని, చెరువులకు పూజలు చేసే పండుగ బతుకమ్మ అని, తెలంగాణ అంటేనే చెరువులు అని, బతుకమ్మ చెరువుల్లో నీరు తాగేదని, పొలాలకు నీరు అందించేదని ఆమె తెలిపారు. మన జీవన శైలి చెరువులపై ఆధారపడి ఉందని, హైదరాబాద్‌కు లేక్ సిటీ అని పేరు ఉండేదని, కానీ, ఈ రోజు అవి కనుమరుగు అయిపోయాయని ఆమె తెలిపారు. ఆటలు, పాటలు, బతుకమ్మకు పూజలు ఇది తరతరాలకు అందించాల్సిన అవసరం ఉందని మంత్రి సీతక్క పిలుపునిచ్చారు.



# బిల్డింగులు కట్టేవారు నోటీసు బోర్డులు పెట్టాలి

మొదటి పేజీ తరువాయి



ఇరిగేషన్, రెవెన్యూ, హెచ్ఎండీఏ ఆఫీసర్లు కలిసి ఫీల్డ్‌విజిట్‌చేసిన తర్వాతే అనుమతులు ఇస్తామని ప్రకటించింది. తాజాగా వాటితోపాటు కొత్తగా ప్రతి నిర్మాణదారుడు తాము నిర్మించే బిల్డింగుల ఎదుట నోటీసు బోర్డు ఏర్పాటు చేయాలని ఆదేశించింది. హెచ్ఎండీఏ అనుమతులు ఇచ్చిన తర్వాత నిర్మాణదారుల నుంచి నోటీసు బోర్డు ఏర్పాటు చేస్తామనే హామీ పత్రం తీసుకుంటుంది. దీని ప్రకారం ప్రతి నిర్మాణదారుడు నిర్మాణ స్థలంలో ఏర్పాటు చేసే బోర్డులో స్థలం వివరాలు, సర్వే నంబర్, ఎన్నిఫ్లోర్లు కడుతున్నారు? అనుమతులకు సంబంధించిన నంబర్, స్థలం ఎఫ్‌టీఎల్ కానీ బఫర్‌జోన్‌లో కానీ లేదని తెలియజేయాలి. దీని వల్ల అందులో అక్కడ విల్లా లేదా ఫ్లాట్‌కొనాలనుకునేవారు, కమర్షియల్‌అయితే స్పేస్ కొనేవారికి పూర్తి సమాచారం దొరుకుతుంది. కొన్న తర్వాత అనుమతులు లేవనో, చెరువు ప్రాంతంలో ఉందనో హైడ్రా వచ్చి కూల్చివేసే పరిస్థితులు ఉంటాయి. హెచ్ఎండీఏ కొత్త రూల్‌తో ఇక నుంచి ఆ భయం ఉండదు.

# అర్హులైన మిగతా రైతులందరికీ వారంలో రుణమాఫీ



నల్లగొండ జిల్లా, అక్టోబరు 10 (తీన్మార్ న్యూస్): వారం, పది రోజుల్లో అర్హులైన మిగతా రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ చేయనున్నట్లు రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. ఒకేసారి 22 లక్షల మంది రైతులకు రూ.18 వేల కోట్ల రుణాలు మాఫీ చేశామని వెల్లడించారు. బుధవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఆర్జాలబావి వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి మాట్లాడుతూ.. నల్లగొండ జిల్లాలో గత సీజన్‌లో సైతం ధాన్యం కొనుగోలు చేసిన మూడ్రోజుల్లోనే రైతులకు చెల్లింపులు చేశామని, ఈ సీజన్‌లోనూ మూడ్రోజుల్లోనే వారి బ్యాంకు ఖాతాల్లో ధాన్యం డబ్బులు జమ చేస్తామని తెలిపారు. రూ.2 లక్షల కన్నా ఎక్కువగా ఉన్న రైతుల రుణాలనూ వారం, పది రోజుల్లో మాఫీ చేస్తామని చెప్పారు. సన్న ధాన్యాన్ని ప్రోత్సహించడంలో భాగంగా ప్రత్యేకించి తమ ప్రభుత్వం రూ.500 బోనస్ ఇస్తోందన్నారు. పేదలు కూడా సన్నబియ్యం తినాలనే ఉద్దేశంతో వచ్చే జనవరి నుంచి రేషన్ కార్డుల ద్వారా సన్నబియ్యం పంపిణీ చేయాలని నిర్ణయించిందని తెలిపారు. అన్ని సామాజికవర్గాల విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని రూ.200కోట్లతో ఇంటిగ్రేటెడ్ హాస్టళ్లను కట్టిస్తున్నామని, తొలి విడతలో 20నియోజకవర్గాల్లో ఈ నెల 11వ తేదీన హాస్టల్ భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 10 నెలల్లో 70 వేల ఉద్యోగాలు ఇచ్చామన్నారు.

# మంత్రి కొండా సురేఖపై కేటీఆర్ పరువు నష్టం పిటిషన్ దాఖలు



హైదరాబాద్, అక్టోబర్ 10 (తీన్మార్ న్యూస్): నాంపల్లి కోర్టులో మంత్రి కొండా సురేఖపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పరువు నష్టం పిటిషన్ దాఖలు చేశారు. ఆ పిటిషన్‌పై గురువారం నాంపల్లి కోర్టులో విచారణ జరిగింది. కొండా సురేఖపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కేటీఆర్ తరఫు న్యాయవాది వినతించారు. బాల్క సుమన్, తుల ఉమ, సత్యవతి రాథోడ్, దాసోజు శ్రవణ్‌ను సాక్షులుగా కేటీఆర్ చేర్చారు. కొండా సురేఖ మాట్లాడిన ఆడియో, వీడియో టేపులను కేటీఆర్ న్యాయవాదులు కోర్టుకు సమర్పించారు. 23 రకాల ఆధారాలను అందజేశారు. తదుపరి విచారణ ఈ నెల 14కు కోర్టు వాయిదా వేసింది. కాగా, ఇప్పటికే మంత్రి కొండా సురేఖపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని హీరో అక్కినేని నాగార్జున పిటిషన్ దాఖలు చేయగా, ఆమెకు కోర్టు నోటీసులు జారీ చేసింది. కొద్దిరోజుల క్రితం అక్కినేని నాగార్జున కుటుంబం మీద ఆమె చేసిన వ్యాఖ్యలు పెద్ద దుమారాన్నే రేపాయి. ఈ క్రమంలో మంత్రి తమ కుటుంబంపై అమర్యాద పూర్వక వ్యాఖ్యలు చేశారని నాగార్జున కోర్టును ఆశ్రయించి పరువు నష్టం దావా వేశారు. రాజకీయ లబ్ధి కోసమే మంత్రి కొండా సురేఖ తమ కుటుంబంపై తప్పుడు వ్యాఖ్యలు చేశారని సినీ నటుడు నాగార్జున నాంపల్లి కోర్టులో స్టేట్‌మెంట్ ఇచ్చారు. అయితే, తాజాగా స్పెషల్ మెజిస్ట్రేట్ కోర్టు మంత్రి కొండా సురేఖకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణ ఈ నెల 23న జరగనుంది.

# ఈ నెల 14 నుంచి గ్రూప్-1 మెయిన్స్ హాల్‌టికెట్లు

హైదరాబాద్, అక్టోబర్ 10 (తీన్మార్ న్యూస్): గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలకు ఎంపికైన అభ్యర్థుల హాల్‌టికెట్లు ఈ నెల 14 నుంచి టీజీపీఎస్సీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ తెలిపింది. పరీక్షలకు అర్హత సాధించిన అభ్యర్థుల హాల్‌టికెట్లను పరీక్ష తేదీకి వారం రోజుల ముందు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతున్నట్లు కమిషన్ బుధవారం ఓ ప్రకటన విడుదల చేసింది. ఈ హాల్‌టికెట్‌ను డౌన్‌లోడ్ చేసుకుని పరీక్ష కేంద్రాన్ని ముందుగానే సందర్శించాలని కమిషన్ సూచించింది. మెయిన్స్ పరీక్షలు ఈ నెల 21 నుంచి 27వ తేదీ వరకు ప్రతీరోజు మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు జరుగుతాయి. ఈ పరీక్షలకు అభ్యర్థులను మధ్యాహ్నం 12.30 గంటల నుంచి పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తారు. మధ్యాహ్నం 1.30 గంటల తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ అభ్యర్థులను కేంద్రంలోనికి అనుమతించరని కమిషన్ స్పష్టం చేసింది. అభ్యర్థి హాల్‌టికెట్‌ను డౌన్‌లోడ్ చేసుకున్న తర్వాత తొలి పరీక్షకు వినియోగించిన హాల్‌టికెట్‌నే చివరి పరీక్ష వరకు వెంట ఉంచుకోవాలని డూప్లికేట్ హాల్‌టికెట్ జారీ చేసే అవకాశం లేదని పేర్కొంది. సమయం తెలుసుకునేందుకు వీలుగా పరీక్ష హాల్‌లో గడియారాలను ఏర్పాటు చేస్తామని కమిషన్ వివరించింది. హాల్‌టికెట్‌లో పొరపాట్లు, ఇతర సమస్యలుంటే కమిషన్ కార్యాలయం పనిదినాల్లో 040- 23542185 లేదా 040-23542187 ఫోన్ నంబర్ల లో, లేదా హెల్ప్‌డెస్క్‌కు ఈ మెయిల్ ద్వారా సంప్రదించవచ్చని టీజీపీఎస్సీ కార్యదర్శి ఇ.నవీన్ నికోలస్ తెలిపారు.

# హైదరాబాద్‌లో సుప్రీంకోర్టు బెంచ్‌ను ఏర్పాటు చేయాలి

మొదటి పేజీ తరువాయి

వినాయక్‌రావు, హైకోర్టు న్యాయవాది భూపాల్‌రాజ్‌లతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. సుప్రీంకోర్టు రీజినల్ బెంచ్ సాధన సమితి ఆధ్వర్యంలో ఈ నెల 10న మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు నల్లకుంటలోని దక్షిణ భారత అడ్వకేట్ జేఏసీ కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. సమావేశానికి సుప్రీంకోర్టు న్యాయ వాదులు, మేధావులు, పలువురు ప్రముఖులు హాజరవుతారని ఆయన తెలిపారు.

# అమ్రపాలికి కేంద్ర సిబ్బంది వ్యవహారాల శాఖ షాక్

మొదటి పేజీ తరువాయి



చెందుతారని కేంద్ర సిబ్బంది వ్యవహారాల మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. రాష్ట్ర విభజన తర్వాత సివిల్ సర్వీసు అధికారుల కేటాయింపు కోసం ఖండేకర్ కమిటీని నియమించారు. ఆ కమిటీ నిబంధనల ప్రకారం విభజించింది. అయితే ఆ నివేదికలో పేర్కొన్న పలువురు తమ క్యాడర్పై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ కేంద్రానికి,క్యాట్కు దరఖాస్తుకు పెట్టుకున్నారు. ఏపీకి కేటాయించిన ఎక్కువ మంది తాము తెలంగాణ స్థానికతతో ఉన్నామని తమకు తెలంగాణ క్యాడరే కావాలని ఉండిపోయారు. అలాంటి అధికారి అయిన సోమేష్ కుమార్ ఏపీలో సీఎస్గా ఉండగా కోర్టు ఏపీకి వెళ్లాల్సిందేనని స్పష్టం చేసింది. దాంతో ఆయన తెలంగాణ నంచి రిలీవ్ అయి ఏపీలో రిపోర్ట్ చేసి వాలంటరీ రిటైర్మెంట్ తీసుకున్నారు. ఇప్పుడు అమ్రపాలికి కూడా దాదాపుగా అదే పరిస్థితి వచ్చింది. హైదరాబాద్ కమిషనర్ గా ఉన్న ఆమె ఉన్న పళంగా ఏపీలో రిపోర్టు చేయాల్సిన పరిస్థితి వస్తోంది. ఖండేకర్ కమిటీ సిఫారసులు చేసిన సమయంలో స్థిర నివాసం అనే కాలమ్ను కీలకంగా తీసుకున్నారు. యూపీఎస్సీకి దరఖాస్తు చేసిన సమయంలో కాట అమ్రపాలి తన పర్మినెంట్ అడ్రస్గా విశాఖ పట్నంను పేర్కొన్నారు. ఖండేకర్ కమిటీ నివేదిక ఇచ్చిన తర్వాత ప్రత్యూష్ సిన్హా కమిటీ ఆ నివేదిక ఆధారంగా క్యాడర్ ను కేటాయించింది. దీన్ని పరిగణనలోకి తీసుకున్న ఖండేకర్ కమిటీ ఆమెను ఏపీకి కేటాయించింది. అయితే తనను తెలంగాణ స్థానికురాలిగా పరిగణించి.. తెలంగాణకే కేటాయించాలని ఆమె అప్పీల్ చేసుకున్నారు. ప్రత్యూష్ సిన్హా కమిటీ మొదట్లోనే ఆమె అభ్యర్థనను తిరస్కరించింది.

హైకోర్టు కూడా ఖండేకర్ కమిటీ ఆధారంగా ప్రత్యూష్ సిన్హా కమిటీ చేసిన సిఫారసులనే అమలు చేయాలని స్పష్టం చేసింది. కాట అమ్రపాలికి ప్రస్తుతం అన్ని మార్గాలు మూసుకుపోయినట్లేనని ఆమె ఖచ్చితంగా తెలంగాణలో రిలీవ్ అయ్యి.. ఏపీలో రిపోర్టు చేయాల్సిందేనని భావిస్తోంది. తెలంగాణ ఏర్పడిన తర్వాత వరంగల్ జిల్లాకు కలెక్టర్ గా చేసిన అమ్రపాలి తర్వాత కేంద్రమంత్రిగా ఉన్న కిషన్ రెడ్డి ఓఎస్డీగా.. ప్రధానమంత్రి కార్యాలయంలోనూ పని చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత మళ్లీ తెలంగాణకు వచ్చారు రేవంత్ సర్కార్ లో ఆమెకు కీలక పోస్టులు దక్కాయి. అయితే ఇప్పుడు ఏపీకి తప్పక వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది.

# రిటర్న్ జర్నీలో బస్సులు ఖాళీ.. చార్జీలు పెంపు తప్పదు

మొదటి పేజీ తరువాయి



ఛార్జీలు ఉంటాయని బాంబు పేల్చారు. ఆర్టీసీ ఎండీ సజ్జనార్ బుధవారం మీడియాతో మాట్లాడుతూ దసరా రద్దీ దృష్ట్యా 6300 బస్సులు నడుపుతున్నాం. మహాలక్ష్మి స్కీమ్ కింద మరో 600 బస్సులు అదనంగా నడిపిస్తున్నాం. స్పెషల్ బస్సుల్లో అదనపు ఛార్జీలు ఉంటాయి. ఇప్పటికే కొన్ని బస్సులు నడుస్తున్నాయి. గురువారం నుంచి మొత్తం బస్సులు నడిపిస్తాం. ఈనెల 14వరకు అదనపు బస్సులు అందుబాటులో ఉంటాయి. దసరా పండుగ కాబట్టి రిటర్న్ జర్నీలో బస్సులు ఖాళీగా రావాల్సి ఉంటుంది. కాబట్టి కొంత చార్జీలు పెంపు తప్పదు. మహాలక్ష్మి స్కీమ్‌లో భాగంగా ఆధార్ కార్డు తప్పనిసరిగా చూపించాలి అని చెప్పారు. ఇక, దసరా పండుగ సందర్భంగా హైదరాబాద్ నుంచి చాలా మంది తమ స్వగ్రామాలకు పయణమవుతున్నారు. విద్యా సంస్థలకు ఇప్పటికే సెలవులు ఇవ్వడంతో వారంతా ముందుగానే ఇళ్లకు చేరుకున్నారు. సద్దుల బతుకమ్మ కావడంతో స్వగ్రామాలకు వెళ్లే వారి సంఖ్య మరింత పెరిగింది.

# రతన్ టాటా మరణం పట్ల కేసీఆర్ సంతాపం



హైదరాబాద్, అక్టోబర్ 10 (తీన్మార్ న్యూస్): భారత సమాజం గర్వించే ప్రపంచ వ్యాపార దిగ్గజం, పద్మ విభూషణ్ రతన్ టాటా మరణం పట్ల తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సంతాపం ప్రకటించారు. ఆర్థిక ప్రగతికి మానవత్వాన్ని అద్దిన అరుదైన పారిశ్రామికవేత్త రతన్ టాటా అని పేర్కొన్నారు. సమాజహితుడిగా వారి తాత్వికత, దార్శనిక కార్యాచరణ ప్రజా సంక్షేమాన్ని కాంక్షించే ప్రతి ఒక్కరికీ ఆయన ఆదర్శం అని కేసీఆర్ అన్నారు. పారిశ్రామిక ప్రగతికి మానవీయ కోణాన్ని అద్దిన మానవతావాది, దార్శనికుడు, పరోపకారి రతన్ టాటా అని కేసీఆర్ కొనియాడారు. అభివృద్ధి ఫలాలు కింది స్థాయికి చేరుకోవాలనే సామాజిక ఆర్థిక తాత్వికత ను సొంతం చేసుకున్న అరుదైన పారిశ్రామిక వేత్త రతన్ టాటా అని కేసీఆర్ తెలిపారు. సమాజ సంక్షేమం కోసం, రేపటి తరాల ఉజ్వల భవిష్యత్తుకోసం జీవితకాలం తపించిన రతన్ టాటా ఆదర్శాలు, కార్యాచరణ ప్రపంచ ఆర్థిక పారిశ్రామిక రంగానికి దిక్సూచిగా నిలవాలని కేసీఆర్ ఆకాంక్షించారు. నాటి బీఆర్ఎస్ ప్రభుత్వ ఆహ్వానం మేరకు ఒక కార్యక్రమానికి హాజరై, నూతన తెలంగాణ రాష్ట్రం అనతికాలంలో సాధిస్తున్న అభివృద్ధిని అభినందించడం, సాంకేతిక పారిశ్రామిక రంగాల్లో నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన దార్శనిక కార్యాచరణ పట్ల వారు ఆనందాన్ని వ్యక్తం చేయడం తెలంగాణ కు గర్వకారణమని కేసీఆర్ స్మరించుకున్నారు. మానవతావాది రతన్ టాటా మృతి భారత పారిశ్రామిక రంగానికే కాకుండా సమాజ సంక్షేమాన్ని ప్రగతిని కాంక్షించే ప్రతి ఒక్కరికీ తీరని లోటని కేసీఆర్ అన్నారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. శోకతప్తులైన వారి కుటుంబ సభ్యులకు కేసీఆర్ తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

# ఈనెల 20న కేబీఆర్ పార్కులో ప్రజా సంబురాలు

మొదటి పేజీ తరువాయి

ఆమె మాట్లాడుతూ నేచర్, కల్చర్, ఆర్ట్, క్రాఫ్ట్, అడ్వెంచర్ తదితర కాంపిటీషన్స్ నిర్వహిస్తారని పేర్కొన్నారు. కేబీఆర్ పార్కుకు 9 గేట్లు ఉన్నాయని, ఒక్కో గేటు వద్ద ఒక్కో యాక్టివిటీ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు కార్యక్రమాలు జరుగుతాయన్నారు. మున్ముందు ప్రజల సందడి ఉన్నచోట ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు నళిని పద్మావతి, పంకజ, వేణుగోపాల్ రెడ్డి, చీఫ్ హార్టీకల్చర్ ఆఫీసర్ సునంద, డిప్యూటీ కమిషనర్ ప్రశాంతి పాల్గొన్నారు.

# పండగ వేళ రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం తీపికబురు

మొదటి పేజీ తరువాయి

చెల్లించాల్సిన పన్నుల వాటా రూ1,78,173 కోట్లను విడుదల చేసింది. రాష్ట్ర ప్రభుత్వాలకు అందించే నెలవారీ పన్నుల వాటా కాకుండా ఈసారీ పండగలు, రాష్ట్రాల అభివృద్ధి, మూలధన వ్యయానికి ఊతమిచ్చేలా అదనంగా ఒక నెల అడ్వాన్స్ చెల్లింపల కింద మరో రూ.89,086.50 కోట్లు రిలీజ్ చేసింది. ఇందులో తెలంగాణకు 3,745 కోట్లు, ఆంధ్రప్రదేశ్ కు 7,211 కోట్లు చెల్లించింది. అత్యధికంగా యూపీకి రూ. 31,962 కోట్లు దక్కనుండగా బిహార్ కు రూ.17,921 కోట్లు, మధ్యప్రదేశ్ కు 13,987 కోట్లు, పశ్చిమబెంగాల్ కు రూ. 13,404, మహారాష్ట్రకు రూ.11,255, రాజస్థాన్ కు రూ.10,737 కోట్లను విడుదల చేసింది.

# హైదరాబాద్ వ్యాప్తంగా భారీ వర్షం

మొదటి పేజీ తరువాయి

కమ్ముకున్నాయి. దీంతో నగరంలోని పలు ప్రాంతాల్లో వర్షం కురుస్తోంది. నారాయణగూడ, హిమాయత్ నగర్, బషీర్ బాగ్, అబిడ్స్, కోఠి పరిసర ప్రాంతాల్లో వర్షం కురుస్తోంది. సరూర్ నగర్, కొత్త పేట, మలక్‌పేట పరిసర ప్రాంతాల్లో వర్షం పడుతుంది. జూబ్లీహిల్స్, మాదాపూర్, యూసఫ్ గూడ, కీసర, ఘట్ కేసర్, అబ్దుల్లాపూర్ మెట్, నాంపల్లి, ఖైరతాబాద్, నాంపల్లి, దిల్ సుఖ్ నగర్, శివరాంపల్లి తదితర ప్రాంతాల్లో జోరు వాన పడుతుంది. అయితే గురువారం సద్దుల బతుకమ్మ కావడంతో సాయంత్రం పూట ఆడుకోవడనికి వెళ్లే వారికి కొంచెం ఇబ్బంది తలెత్తాయి.

# ప్రజలందరికీ సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపిన మంత్రి సీతక్క



తెలంగాణ బ్యూరో, అక్టోబర్ 10 (తీన్మార్ న్యూస్): తెలంగాణ ప్రజలందరికీ సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు మంత్రి సీతక్క బతుకమ్మ స్ఫూర్తితో ప్రకృతిని, చెరువులను కాపాడుకుందామని ఈ సందర్భంగా మంత్రి పిలుపునిచ్చారు. చెరువులకు బతుకమ్మకు అవినాభావ సంబంధం ఉందని, చెరువులు నిండితేనే మన పంటలు పండుతాయన్నారు. పంటలు పండుతేనే మనం పండుగ చేసుకోగలుగుతామన్నారు. అందుకే అందరమూ చెరువులను కాపాడుకుందామని చెప్పుకొచ్చారు. బతుకు నిచ్చే పండగ బతుకమ్మ పండుగ అని పేర్కొన్నారు.

తీన్మార్
తెలుగు దినపత్రిక

# ఎడిటోరియల్ మార్చుకుందాం..

వ్రతం చెడినా ఫలితం దక్కలేదన్న సామెత ఇప్పుడు బీజేపీకి సరిగ్గా సరిపోతుంది. మొన్న సార్వత్రిక ఎన్నికల్లో, ఇవాళ జమ్మూకశ్మీర్ ఎలక్షన్స్ ఫలితాలు చూస్తే ఇదే స్పష్టం అవుతుంది. 500 ఏళ్ల హిందువుల కల అయోధ్య రామ మందిర నిర్మాణంచేపట్టినా, ఆర్టికల్ 370 రద్దు చేసినా బీజేపీకి చేదు ఫలితం ఎదురైంది..రామ మందిరాన్ని కట్టించి హిందువుల చిరకాల కోరికను నిజం చేసి చూపించారు ప్రధాని మోదీ. అవాంతరాలు, అడ్డంకులు..కోర్టు కేసులు..వివాదాలు అన్నీ ఒక్కొటిగా దాటుకునిభవ్యరామ మందిరం నిర్మాణం పూర్తి చేశారు. రాముడి ప్రతిష్ఠ జరిపారు. దేశమంతా హ్యాపీ అనుకున్నారు. ఇది చూసిన హిందువులు, బీజేపీ ఇంకా హ్యాపీ. రాముడికి ఇన్నాళ్లకు ఓ నీడ దొరికిందని సంతోష పడ్డారు. రామ మందిరం నిర్మాణం పూర్తి చేశామన్న ఉత్సాహంతో లోక్ సభ ఎన్నికలకు దిగిన బీజేపీకి ఊహించని షాక్ తగిలింది. అయోధ్య అసెంబ్లీ ఉన్న ఫైజాబాద్ లోక్ సభ నియోజకవర్గాన్ని ఇండీ కూటమిలోని సమాజ్ వాదీ పార్టీ గెలుచుకుంది. అంటే ఇన్నేళ్ల కలను తీర్చిన అయోధ్య ప్రజలు చుట్టుపక్కల నియోజకవర్గాల వాళ్లు బీజేపీని తిరస్కరించారని అర్థం. ఇది ఊహించని షాక్ బీజేపికి అని చెప్పవచ్చు.తాజాగా రెండో షాక్ తగిలింది. ఆర్టికల్ 370 రద్దుతో కశ్మీర్ ను పూర్తిగా భారత్ చట్టాల పరిధిలోకి తీసుకువచ్చింది బీజేపీ ప్రభుత్వం. దీని కోసం ఎన్నో ఏళ్లుగా వ్యూహం పన్నింది. అస్సలు బీజేపీ ఐడియాలజీకి సరిపోని మెహబూబా ముఫ్తీతో పొత్తు పెట్టుకుని గెలిచింది. తర్వాత మద్దతు ఉపసంహరించుకుని మోదీ, అమిత్ షా రాజకీయ చాణక్యాన్ని ప్రదర్శించారు. రాజకీయ వ్యూహాలతో కశ్మీర్లోని పార్టీలను ఉక్కిరి బిక్కిరి చేసి వేర్పాటువాద శక్తులు సైతం బిత్తరపోయేలా ఆర్టికల్ 370 రద్దు చేశారు. ఫలితంగా కశ్మీర్ రాష్ట్రం హోదా కోల్పోయి రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విడిపోయింది. జమ్ము కశ్మీర్ , లద్దాఖ్ అనే రెండు కేంద్రపాలిత ప్రాంతాలు కొత్త ప్రయాణం మొదలు పెట్టాయి. తర్వాత తొలిసారిగా అక్కడ ఎన్నికలు జరిగాయి. జనరల్ గా పాకిస్థాన్ కబంధ హస్తాల్లోనూ..వేర్పాటు వాద శక్తుల చేతుల్లోకి వెళ్లిపోతున్న కశ్మీర్ ను పూర్తిగా మన చేతుల్లోకి తెచ్చుకునేలా..పాక్ ఆక్రమిత కశ్మీర్ కూడామాదే అని పార్లమెంటులో గర్జించిన అమిత్ షా కామెంట్స్ కు దేశభక్తి తో ఉప్పొంగిపోయిన ప్రజలు బీజేపీకి పట్టం కట్టాలి కదా. అందుకే ఈసారి పీడీపీతో కూడా పనిలేకుండా సింగిల్గా బరిలోకి దిగింది. కానీ ఈరోజు వచ్చిన రిజల్ట్ బీజేపీకి షాక్ ఇచ్చింది.అబ్దుల్లాల పార్టీ నేషనల్ కాన్ఫరెన్స్ తో జత కట్టిన కాంగ్రెస్ కశ్మీర్ లో హవా చూపించింది. ఈక్వేషన్ సింపుల్. ఫైట్ ఏదైనా కానీ ప్రధాన ప్రత్యర్థులు ఎవరనేదే చూస్తారు. మన దేశంలో జాతీయ స్థాయిలో రెండే ప్రధాన అధికార కేంద్రాలు. ఒకటి బీజేపీ రెండు కాంగ్రెస్. పదేళ్లుగా దేశాన్ని పాలిస్తున్న మోదీ గద్దె దింపాలని ఈ కాంగ్రెస్ దేశంలోనే చాలా విపక్షాలు ఏకం చేసి ఇండీ కూటమిగా ఏర్పడ్డాయి. భారత్ జోడో యాత్ర పేరుతో కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకూ రాహుల్ గాంధీ నడిచారు. శ్రీనగర్ లో మంచులోతడుస్తూ యాత్రను ముగించే ప్రసంగం చేశారు కూడా. ఆ తర్వాత జరిగిన లోక్ సభ ఎన్నికల్లో బీజేపీకి ఊహించనంత పోటీ ఇచ్చింది కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండీ కూటమి. సొంతంగా 99 ఎంపీ స్థానాలు గెలుచుకుని బీజేపీ ఆధిక్యాన్ని తగ్గించటమే కాదు..పార్లమెంటులో బీజేపీ ఆటలు సాగే అవకాశం లేనంత పెద్దశక్తిగా నిలబడింది.కానీ ఇక్కడ ఆలోచించాల్సింది ఏంటంటే..బీజేపీ అనే పార్టీ ఏర్పాటుకు కొన్ని సిద్ధాంతాలు చాలా మూలం. వాటి సాధన కోసమే భారతీయ జనతా పార్టీ ఏర్పడింది. ఇక

జమ్మూకాశ్మీర్ విషయంలో బీజేపీ పరిపాలనను ఎండగట్టాయి కాంగ్రెస్, నేషనల్ కాన్ఫరెన్స్. ఈ రెండు పార్టీలు కలిసి మేజిక్ ఫిగర్ను దాటేశాయి. గడిచిన పదేళ్లుగా జమ్మూకాశ్మీర్లో బీజేపీ తీసుకున్న నిర్ణయాలే ఇందుకు కారణమని కొందరు రాజకీయ విశ్లేషకులు చెబుతున్నమాట.ఢిల్లీ విషయానికొద్దాం.. బీజేపీ వ్యూహాలను గమనించారు ఆఫ్ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్. లిక్కర్ స్కామ్లో బెయిల్పై విడుదలైన తర్వాత ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు. ముఖ్యమంత్రి కుర్చీపై మహిళను కూర్చొబెట్టారు. దీంతో ఢిల్లీ ఓటర్లలో ఆ పార్టీ మరింత ఇమేజ్ పెరిగింది. బలమైన పోటీ ఇవ్వాలని భావించారు కమలనాథులు. కేజ్రీవాల్ ఎత్తులకు బీజేపీ చిత్తయ్యిందనే చెప్పవచ్చు. కాంగ్రెస్తో కలిసి ఆప్ పోటీ చేస్తే హస్తిన పీఠం బీజేపీ అందుకోవడం కష్టమేనని అంటున్నారు.ఉత్తరాదిలో ప్రజలు రిజక్ట్ చేస్తే కష్టమనే అభిప్రాయం అప్పుడే కమలనాథుల్లో మొదలైంది. గడిచిన పదేళ్లు మోదీ హవా మీద గెలిచామని చెప్పుకుంటూ కాలం గడిపేశారు కీలక నేతలు. రాష్ట్రాల ఫలితాలతో ఒక్కసారిగాఖంగుతిన్నారు నేతలు.ఇక బీజేపీలో మోదీ శకం ముగిసినట్టేనన్న వాదన ఓ వర్గంలో మొదలైంది. పరిస్థితి జఠిలం కాకముందే మేల్కొంటే మంచిందని, లేకుంటే కష్టమని అంటున్నారు. ఈ క్రమంలో జమిలి ఎన్నికలకు తెరపైకి తెచ్చిందని అంటున్నారు. ఈ ఫలితాలతో కమలనాథుల్లో కనువిప్పు కలిగేనా? వ్యక్తి పూజ కంటిన్యూ చేస్తారా అనేది రాబోయే రోజుల్లో తేలాల్చివుంది.ఇద్దరు ఎంపీలతో ప్రస్థానాన్ని ప్రారంభించి దేశంలో ఇప్పుడు వరుసగా మూడోసారి అధికారాన్ని కైవసం చేసుకుంది. అలాంటి కీలక సిద్ధాంతాల్లో రెండోదైన అయోధ్య రామమందిర నిర్మాణం, ఆర్టికల్ 370 లాంటి వి రద్దు చేసినా..ప్రధానంగా ఆ ప్రభావం కనిపించాల్సిన రెండు ప్రాంతాల్లోనూ బీజేపీ ఓటమి అనేది రాహుల్ గాంధీ విజయంగా..తనను తగ్గించుకునైనా సరే అక్కడ ఎవరిని పెట్టాలో వాళ్లని పెట్టి..ఎవరితో చేతులు కలపాలో వాళ్లతో చేతులు కలిపి మోదీ, అమిత్ షా లాంటి వాళ్లకే షాక్ ఇచ్చిన రాజకీయ వ్యూహంగా చూడాలా. లేదా రెండు ఏదో కాకతాళీయంగా ఓడిపోయింది బ్యాడ్ లక్ అనుకోవాలా..

# ఒక చిన్న గౌడన్నలకు కాంగ్రెస్ ప్రభుత్వం చేయూత





## – కాటమయ్య రక్ష కిట్ లను పంపిణి చేసిన ఎమ్మెల్యే

హన్మకొండ, అక్టోబర్ 10 (తీన్మార్ న్యూస్): కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తరువాత అన్ని వర్గాల ప్రజలకు, వృత్తి అదారిత కుటుంబాలకు అండగా ఉంటుందని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో హనుమకొండ జిల్లా బిసి సంక్షేమం శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గౌడ సోదరులకు కాటమయ్య రక్షా కిట్ లను పంపిణి చేశారు. పండుగ వేళ గౌడన్నలకు రక్ష కిట్ లను నా చేతుల మీదుగా పంపిణీ చేయడం అదృష్టంగా భావిస్తున్న. ప్రభుత్వం తరపున అందిస్తున్న కిట్ వలన ప్రాణాపాయా స్థితుల నుంచి కాపాడటం చాలా ఆనందంగా ఉంది. గౌడ కులస్తులకు జిల్లా కేంద్రంలో కమ్యూనిటీ హాల్ ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘ రాష్ట్ర అధ్యక్షులు యాదగిరి గౌడ్,జిల్లా అధ్యక్షులు శ్రీపతి గోపి,ప్రధాన కార్యదర్శి కుమారస్వామి, జిల్లా ఎక్సైజ్ సూపరిడెంట్ చంద్రశేఖర్, జిల్లా వెనుకబడిన శాఖ అధికారి రామ్ రెడ్డి, గౌడ్ కుల నేతలు, నాయకులు, ఎక్సైజ్ అధికారులుతదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ మానసిక ఆరోగ్య సందర్భంగా సమావేశం

## పాల్గొన్న జిల్లా వైద్యాధికారి అల్లం అప్పయ్య

ములుగు జిల్లా, అక్టోబర్ 10 (తీన్మార్ న్యూస్): తెలంగాణ ప్రభుత్వ కుటుంబ సంక్షేమ కమిషనర్ ఆదేశానుసారం గురువారం ప్రపంచ మానసిక ఆరోగ్య సందర్భంగా ములుగు జిల్లా ప్రధాన ఆసుపత్రి మీటింగ్ హాల్లో ఏర్పాటు చేసిన సమావేశానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ ఆధునిక ప్రపంచంలో ఈ మధ్య ఎక్కువగా మానసిక ఆరోగ్యం సమస్యలు ఎక్కువవుతున్నాయని, వాటిని మొదటి దశలోనే గుర్తించి సరైన కౌన్సిలింగ్ ఇవ్వడం ద్వారా మరియు తొలి దశలోనే చికిత్స చేయడం ద్వారా నయం చేయవచ్చునని తెలిపారు. అంతేగాక మానసిక రోగులు ముఖ భావంగా ఉండడం, ఎక్కువగా నిద్రపోవడం ఆల్కహాలకు మత్తు పదార్థాలకు బానిస అవడం, అనుకోకుండా కోపాన్ని ప్రదర్శించడం మొదలగు లక్షణాలు వారిలో కనిపిస్తాయని తెలిపారు. ఒకరి భావాలను ఇంకొకరితో పంచుకోవడం వలన ,శారీరక శ్రమ చేయడం వలన ,యోగా మెడిటేషన్ లాంటివి చేయడం వలన ,దానితో పాటు మంచి హారాన్ని తీసుకోవడం వలన, ఒంటరిగా ఉండకుండా ఇతరులతో




కలిసిమెలిసి ఉండడం వలన ,మానసిక ఒత్తిడి నుండి విముక్తి పొంది రిలాక్స్ కావచ్చునని డి ఎం ఎన్ హెచ్ ఓ డాక్టర్ అప్పయ్య తెలిపారు. ఈ సమావేశానికి జిల్లా అసంకామిక వ్యాధుల నివారణ అధికారి డాక్టర్ పవన్ కుమార్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో సైక్రియాసిస్ట్ డాక్టర్ నమ్రత, డాక్టర్లు, హాస్పిటల్ స్టాఫ్ నర్సులు మరియు హాస్పటల్ సిబ్బంది మొదలగు వారు పాల్గొన్నారు.

# కలెక్టర్ ఛాంబర్లో ఆర్థిక దృక్పథం తెలుగు పుస్తక ఆవిష్కరణ

జయశంకర్ భూపాలపల్లి జిల్లా, అక్టోబర్ 10 (తీన్మార్ న్యూస్): ఆర్థిక వృద్ధి, సామాజిక అభివృద్ధి, కీలక ఆర్థిక సూచికలను క్రోడీకరించి ఆర్థిక వ్యవస్థలోని వివిధ రంగాలలో మన రాష్ట్రం ఎలా పురోగమిస్తోందో తెలంగాణ సామాజిక ఆర్థిక దృక్పథం 2024 తెలియచేస్తుందని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. గురువారం కలెక్టర్ ఛాంబర్ లో ముఖ్య ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ సామాజిక ఆర్థిక దృక్పథం 2024 తెలుగు పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమానికి సంబంధించిన సమగ్ర సమాచారం ఈ పుస్తకంలో పొందుపరిచినట్లు పేర్కొన్నారు. వ్యవసాయం, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మరియు ఫార్మాస్యూటికల్స్తో సహా విభిన్న రంగాల ద్వారా రాష్ట్ర ఆర్థిక స్థితిని, రాష్ట్రం యొక్క వ్యూహాత్మక స్థానం, నైపుణ్యం కలిగిన శ్రామికశక్తి మరియు సహాయక విధానాలు గణనీయమైన పెట్టుబడులు, ఆర్థిక వృద్ధి మరియు ఉ పాధి అవకాశాలను తెలియ చేస్తూ ప్రణాళికా శాఖ ఈ పుస్తకాన్ని రూపొందించినట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగాలు సాధనలో వివిధ పోటీ పరీక్షలకు సన్నద్ధం అవుతున్న అభ్యర్థులకు ఈ పుస్తకం



ఎంతగానో ఉపయోగ పడుతుందని అన్నారు. సమగ్ర సమాచారంతో పుస్తక రూపకల్పనలో భాగస్వాములైన అన్ని విభాగాల అధికారులను, సిబ్బందిని కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయ లక్ష్మి, ముఖ్య ప్రణాళిక అధికారి బాబూరావు, గణాంక అధికారి బి.జవహర్ లాల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సద్దుల బతుకమ్మ వేడులకు ఓరుగల్లులో ఏర్పాట్లు పూర్తి

వరంగల్, అక్టోబర్ 10 (తీన్మార్ న్యూస్): సద్దుల బతుకమ్మ వేడులకు ఓరుగల్లు రెడీ అయింది. రాష్ట్రానికి బతుకమ్మ పండుగ ఫేమస్ అయితే.. ఓరుగల్లులో సద్దుల బతుకమ్మ సంబురాలను గురువారం ఉత్సాహంగా నిర్వహిస్తారు. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం తరపున వరంగల్ బల్దియా అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈనెల 2న ఎంగిలిపూల బతుకమ్మతో మొదలై ఆటపాటలతో తొమ్మిదో రోజైన సద్దుల బతుకమ్మతో పండుగ ముగుస్తుంది. ఎంగిలిపూల బతుకమ్మను వెయ్యిస్తంభాల గుడి ఆవరణలో, హనుమకొండలో పద్మాక్షి ఆలయ ప్రాంతంలో సద్దుల బతుకమ్మ సంబురాలను నిర్వహించేందుకు సంప్రదాయం అనాదిగా వస్తోంది. లక్షలాదిగా మహిళలు, యువతులు తరలివస్తుంటారు. దీంతో ఆ ప్రాంతమంతా పూలవనంగా మారుతుంది. హనుమకొండ చౌరస్తా నుంచి కిలోమీటర్ దూరంలోని హంటర్ రోడ్ పై శాయంపేట జంక్షన్ వరకు రద్దీ నెలకొంటుంది. వరంగల్ ఉర్సు రంగలీల మైదానంలో సంబురాల సందర్భంగా ఉర్సు గుట్ట జంక్షన్ నుంచి రెండు వైపులా కిలోమీటర్ వరకు ఆటపాటలు ఆడిన అనంతరం మహిళలు



బతుకమ్మలను నిమజ్జనం చేస్తారు. ఈ నేపథ్యంలో గ్రేటర్ మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ అశ్విని ఏర్పాట్లను పర్యవేక్షించారు. వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝా బందోబస్తుపై పర్యవేక్షణ చేశారు.

# బతుకమ్మ దసరా పండుగ పేర్లు చెప్పి ఆఫర్లకు ఆశపడి

## సైబర్ నేరగాళ్ల చేతిలో చిక్కి డబ్బులు పంపించి మోసపోవద్దు..?

## పోలీస్ కమిషనర్ డాక్టర్ బి. అనురాధ

సిద్దిపేట: గూగుల్ పే ఫోన్ పే ద్వారా డబ్బులు పంపించేటప్పుడు ఒకటికి రెండుసార్లు చెక్ చేసుకోవాలి. సైబర్ నేరగాళ్ళ పట్ల అప్రమత్తంగా వుండాలి. సైబర్ నేరాల్లో మీరు డబ్బులు పొగొట్టుకున్నారా వెంటనే లేదా, 24 గంటల లోపు ఫిర్యాదు చేస్తే డబ్బులు రికవరీ అయ్యే అవకాశముందని పోలీసు కమిషనర్ అనురాధ అన్నారు. సైబర్ నేరం జరగగానే తక్షణమే ఫోన్ చేయవలసిన నెంబర్లు జాతీయ హెల్ప్ లైన్ నం. 1930, 112, 100., పిర్యాదు చేస్తే సంబంధిత పోలీస్ స్టేషన్ వారు తక్షణమే స్పందిస్తారు. ఫెడెక్స్ కొరియర్ పేరుతో సైబర్ నేరాలు జరుగుతాయి అప్రమత్తంగా ఉండాలి. హనీ ట్రాప్ పేరుతో గుర్తుతెలియని మహిళా ఫోన్ చేసి మీ వీడియో రికార్డ్ చేశామని సైబర్ నేరాలకు పాల్పడతారు జాగ్రత్త,మీ కొడుకు విదేశాల్లో ఇక్కడ డ్రగ్స్ అమ్ముతూ పట్టుపడ్డాడు మరియు ఇతర మహిళలతో అక్రమ సంబంధం పెట్టుకుని కేసులో ఇరుక్కున్నాడు అని సైబర్ నేరగాళ్లు ఫోన్ చేసి బెదిరిస్తారు వారి బెదిరింపులకు ఎవ్వరు కూడా ఆందోళన చెందవద్దు వెంటనే మీ బంధువులకు మీ కొడుకులకు కూతుర్లకు ఫోన్ చేసి వారు ఎలా ఉన్నారో కనుక్కోవాలి. సైబర్ నేరం జరగగానే వెంటనే లేదా 24 గంటల లోపు స్పందించి పోలీసులను ఆశ్రయిస్తే డబ్బులు రికవరీ చేసే అవకాశం 99% ఉంటుందని ఈ అవకాశాన్ని సైబర్ నేరం జరిగిన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పోలీసు కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు.

# జిల్లాలో అక్టోబర్ 14న టార్చ్ ర్యాలీ

ములుగు జిల్లా, అక్టోబర్ 10 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో క్రీడలకు పెద్దపీట వేయాలని ఆలోచనతో రాష్ట్రంలోని 33 జిల్లాల్లో నిర్వహిస్తున్న టార్చ్ ర్యాలీ కార్యక్రమాన్ని ములుగు జిల్లాలో అక్టోబర్ 14వ తేదీన ఉ 11.30 నిలకు ములుగు జిల్లా కలెక్టర్ కార్యాలయం నుండి నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడాల అధికారి తుల రవి ఒక ప్రకటనలో తెలిపారు. ర్యాలీలో భాగంగా మన జిల్లాకు వస్తున్న బృందంలో జాతీయ అంతర్జాతీయ క్రీడాకారులు ఉన్నారని, వారికి స్వాగతం పలుకుతూ ములుగు జిల్లా నుండి అత్యధిక సంఖ్యలో పాల్గొనాలని, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మక తీసుకున్న సీఎం కప్ - 2024 క్రీడాకారులకు కొత్త ఉత్సాహాన్ని నింపుతుందని తెలిపినారు. ఈ టార్చ్ ర్యాలీలో జిల్లా వ్యాప్తంగా క్రీడాకారులు, క్రీడా సంఘాల ప్రతినిధులు, ప్రజా ప్రతినిధులు, ఉద్యోగం, ఉపాధ్యాయ సంఘాలు, పోలీసు శాఖ సిబ్బంది, యువజన నాయకులు, పత్రికా ప్రతినిధులు, ఉత్సాహ వంతులైన అందరూ కూడా పాల్గొని ర్యాలీని విజయవంతం చేయగలరని జిల్లా కలెక్టర్ ములుగు కోరినారు.

# తపాలా దినోత్సవం సందర్భంగా సన్మానం



భిక్కనూర్: జాతీయ తపాలా దినోత్సవం పురస్కరించుకొని స్థానిక తపాలా కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బందికి భారతి ఫౌండేషన్ వ్యవస్థాపకులు లింగాల రాజబాబు గౌడ్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భారతదేశంలో ప్రతి సంవత్సరం అక్టోబర్ 10ని జాతీయ తపాలా దినోత్సవంగా 150 సంవత్సరాలకు పైగా భారతీయ తపాలా శాఖ కమ్యూనికేషన్ రంగంలో పోషించిన పాత్రను, పనిచేస్తున్న ఉద్యోగుల సేవలు చిరస్మరణీయమని అన్నారు. ఆధునిక ప్రపంచంలో ఎన్నో కొత్త టెక్నాలజీ వచ్చినప్పటికీ తపాలా శాఖకు ప్రత్యేక గుర్తింపు ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో తపాలా సిబ్బంది సురేష్, రామచంద్రం, బాల్ నర్సింలు, ఫౌండేషన్ సభ్యులు రాకేశ్, శ్రీనివాస్, రాజు, రవి,నరేష్, సురేష్,చంద్రశేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# రెంజల్ ఎస్సీ కాలనీలో పారిశుద్ధ్య లోపం..



రెంజల్ : మండల కేంద్రమైన రెంజల్ ఎస్సీ కాలనీలో పారిశుద్ధ్య లోపంతో ప్రజలు, చిన్నపిల్లలు రోగాల బారిన పడుతున్నారనీ, ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీ గారి భూమయ్య ఆరోపించారు. పలుమార్లు గ్రామ కార్యదర్శి దృష్టికి తీసుకువెళ్లిన వారు పట్టించుకోవడంలేదని ఆయన అన్నారు. మినీ ట్యాంకుల శుభ్రం చేయడంలో గ్రామపంచాయతీ సిబ్బంది నిర్లక్ష్యం చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. రాబోవు పండుగలను దృష్టిలో పెట్టుకొని ఎస్సీ కాలనీలోని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు, తాగునీటి ట్యాంకులను శుభ్రం చేసి స్వచ్ఛమైన నీటిని ప్రజలకు అందించాలని ఆయన కోరారు. దీని విషయంలో ఎంపీడీవో, జిల్లా పంచాయతీ అధికారులకు వినతి పత్రాలు సమర్పించినట్లు ఆయన పేర్కొన్నారు.

# పసుపు పరిశోధన కేంద్రంలో బతుకమ్మ

కమ్మర్ పల్లి : మండల కేంద్రం శివారులోని కొండ లక్ష్మణ్ పసుపు పరిశోధన స్థానం శుక్రవారం బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పసుపు పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త మహేందర్ మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బతుకమ్మ అంటే పూల పండుగ అన్నారు. పకృతిలో లభించే పూలన్నింటిని పేర్చి మహిళలు సంబరంగా జరుపుకునే పండుగ బతుకమ్మ పండుగ అన్నారు.బతుకమ్మ పండుగ అంటే మహిళలకు ఎంతో ఇష్టమైన పండుగని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా మండలంలోని మహిళలందరికీ ఆయన బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమంలో శ్రీనివాస్, శంకర్, సుభాష్, పరిశోధన స్థానంలో పనిచేసే మహిళ కూలీలు, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ సంస్కృతి బతుకమ్మ

తెలంగాణ పేరు చెప్పగానే గుర్తుకు వచ్చే పండుగ బతుకమ్మ. తొమ్మిది రోజులపాటు రోజుకో తీరున బతుకమ్మను పూలతో పేరుస్తూ జరిపే పండుగ వేల ఏళ్ల చరిత్ర ఉన్న ఈ పండుగ వెనుక కూడా అనేక కథలు ఉన్నవి. చోళ రాజు అయిన ధర్మంగదునికి 100 మంది కుమారులు పుడతారు. వారందరూ యుద్ధంలో మరణిస్తారు. వారికి చాలా కాలం తర్వాత లక్ష్మీదేవి అనుగ్రహంతో వారికి ఆడపిల్ల పుడుతుంది. పుట్టక పుట్టక పుట్టిన పిల్లకు బతుకమ్మ అని పేరు పెట్టి నూరేళ్లు బతకాలని ఆశీర్వదిస్తారు. ఆ అమ్మాయే బతుకమ్మ గా పూజలు అందుకున్నది. గునుగు, చామంతి, తంగేడు, తోక చామంతి, ఎర్రగన్నేరు, గడ్డి పువ్వు, బంతి ముద్దబంతి, రకరకాల పువ్వులను సేకరించి బతుకమ్మను పేరుస్తారు. బతుకమ్మ పైన పసుపు ముద్దను నిలిపి గౌరీ దేవిగా పూజలు చేస్తారు. బతుకమ్మ ప్రకృతితో ముడిపడిన పండుగ. పువ్వులను పూజించే సంస్కృతి తెలంగాణకే దక్కింది. తొమ్మిది రోజులు తొమ్మిది పేర్లతో బతుకమ్మను కొలిచేదరు. మొదటిరోజు ఎంగిలిపూల బతుకమ్మ అని పిలుస్తారు. ఆరోజు నువ్వులు బెల్లం చక్కెర నైవేద్యంగా పెడతారు. రెండవ రోజు అటుకుల బతుకమ్మ ఆరోజు పప్పు బెల్లం అటుకులు ప్రసాదం చేస్తారు. మూడవరోజు ముద్దపప్పు బతుకమ్మగా పిలుస్తారు. ముద్దపప్పు బెల్లం ప్రసాదంగా చేస్తారు. నాలుగవ రోజు నానే బియ్యం బతుకమ్మ, ఐదవ రోజు అట్ల బతుకమ్మ, ఆరో రోజు అలకల బతుకమ్మ, ఆరో రోజును (అర్రేమి అంటారు) ఏడవ రోజు వేపకాయల బతుకమ్మ, ఎనిమిదవ రోజు వెన్నెముద్దల బతుకమ్మగా పిలుస్తారు. 9వ రోజున సద్దుల బతుకమ్మగా పిలుస్తారు. బతుకమ్మ పండుగ ఏ వాడకు ఆ వాడవాళ్ళ వాళ్ల వాకిళ్లలో గ్రామంలో కీలక ప్రదేశంలోనూ బతుకమ్మలను పెట్టి చుట్టూ తిరుగుతూ చప్పట్లు కొడుతూ ఆడుకుంటారు. బతుకమ్మ ఆటలు ఒక ప్రత్యేకత ఉన్నది. ఓ పద్ధతి ప్రకారం అడుగులు వేస్తూ చప్పట్లు కొడుతూ గుండ్రంగా తిరుగుతూ ఆటపాటలతో బతుకమ్మ ఆటలు ఆడుతూ ఉంటారు. బతుకమ్మ పాటలో గొప్ప సాహిత్యం ఇమిడి ఉంటుంది. బతుకమ్మ పాటలు ఎంతో ప్రసిద్ధిగాంచినవి ఆయా ప్రాంతాల ఆచారాలు పేర్లు అలవాట్లు భాషను కలుపుకొని ప్రాంతీయ కథలతో ఉయ్యాలో గౌరమ్మ అని వలలో అని వెన్నెలలో మాటలను చివరన చేరుస్తూ పాటలు పాడుతారు. సద్దుల బతుకమ్మ దసరాకు ఒకటి రెండు రోజుల ముందు సద్దుల బతుకమ్మను జరుపుకుంటారు. సద్దుల బతుకమ్మ రోజు కుటుంబ సభ్యులంతా ఇంట్లోనే ఉంటారు. బతుకమ్మను పెద్దగా పేర్చుకుంటూ పండుగకు ఆడపడుచులు కొత్త బట్టలు ధరిస్తారు. సద్దుల బతుకమ్మ రోజు గ్రామంలో ఉండే ప్రధాన ప్రదేశం దగ్గర బతుకమ్మలను పెట్టి అందరూ ఆడుతారు. బతుకమ్మ ఆడిన తర్వాత బతుకమ్మని ఎత్తుకొని సద్దులు తీసుకొని ఆడుకున్న తర్వాత చెరువుకు దగ్గరికి వెళ్తారు. జొన్న పిండి మక్కా పిండి బెల్లం పెసరపిండి నెయ్యితో చేసిన మలీల సత్తుపిండి దోసకాయ పెసరపప్పు బెల్లం తో సద్దులను తయారు చేస్తారు. చెరువు దగ్గర బతుకమ్మను దించి మరొకసారి ఆడుకొని చెరువులో సాగనంపుతారు. పాటలు పాడుకుంటూ చెరువుల నిమజ్జనం చేస్తారు. తర్వాత తెచ్చిన సద్దులను ఒకరికొకరు పంచుకుంటారు. బతుకమ్మనీళ్ళలో వదలను కూడా ఒక పద్ధతి ప్రకారం చేస్తారు. మోకాలి లోతు నీటి వరకు వెళ్లి నీటిపై బతుకమ్మ నుంచి ఏమాత్రం బతుకమ్మ చెదరకుండా. ఓడుపుగా వదిలి ఇత్తడి తాంబూలాన్ని పక్కకు తప్పిస్తారు. తిరిగి వస్తారు. తెలంగాణ ఉద్యమంలో కూడా బతుకమ్మ ప్రస్తావన ఆటపాటలతో ఉద్యమం జరిగింది. బతుకమ్మ ఆటపాటలతో స్త్రీలను భాగస్వామ్యం చేసింది. అందరినీ ఒకటి చేసే బంగారు బతుకమ్మ పండుగ.



రచన
దేవులపల్లి రమేశ్
సిద్దిపేట, నంగునూర్
9963701294

# నేడు యంగ్ ఇండియా

## - ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణాలకు శంకుస్థాపన

**షాద్ నగర్ కొందుర్గ్ లో పాల్గొననున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

హైదరాబాద్, అక్టోబర్ 10 (తీన్మార్ న్యూస్): రాష్ట్రంలోని బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి సౌకర్యాలతో అత్యంత ప్రామాణికమైన విద్యను అందించాలన్న రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రేపు (శుక్రవారం) వివిధ జిల్లాల్లోని 28 ప్రాంతాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ల నిర్మాణాలకు శంకుస్థాపన చేయనున్నట్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి వెల్లడించారు. మొదటి దశలో చేపట్టనున్న ఈ యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ల పనులకు శంకుస్థాపన కార్యక్రమం ఏర్పాట్లపై సంబంధిత జిల్లాల కలెక్టర్లతో గురువారం సాయంత్రం సి.ఎస్. టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్ర వెంకటేశం, ముఖ్యమంత్రి కార్యాలయ కార్యదర్శి అజిత్ రెడ్డి, సమాచార శాఖ స్పెషల్ కమీషనర్ హనుమంత రావులు కూడా పాల్గొన్న ఈ టెలీ కాన్ఫరెన్స్ లో శాంతి కుమారి మాట్లాడుతూ, రంగారెడ్డి జిల్లాలోని షాద్ నగర్ నియోజకవర్గంలోని కొందుర్గ్ లో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మధిర నియోజకవర్గంలో ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క ఈ ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణాలకు శంకుస్థాపన చేస్తారని తెలియచేసారు. రేపు జరిగే శంకుస్థాపన కార్యక్రమానికి సంబంధిత జిల్లాల మంత్రుల, ఇంజార్జ్ మంత్రుల ఆమోదం పొందిన అనంతరం, ఈ కార్యక్రమాన్ని అత్యంత ఉత్సవ వాతావరణంలో, ఘనంగా నిర్వహించాలని కలెక్టర్లను ఆదేశించారు. ఆయా జిల్లాలకు చెందిన ప్రజాప్రతినిధులందరినీ ఈ శంకుస్థాపన కార్యక్రమానికి ఆహ్వానించాలని స్పష్టం చేసారు. ఈ స్కూళ్ల నిర్మాణాలను రోడ్లు, భవనాల శాఖ ఆధ్వర్యంలో నిర్మించడం జరుగుతుందని పేర్కొన్నారు. నేడు సాయంత్రమే సంబంధిత అధికారులు, ఇంజనీర్లతో శంకుస్థాపన జరిగే ప్రాంతాన్ని పరిశీలించి ఏర్పాట్లను పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ప్రస్తుతం భూమి లభ్యత ఉన్న ఈ 28 ప్రాంతాల్లో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ లకు శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, రెండవ దశలో ఇతర ప్రాంతాల్లో భూమి ని గుర్తించే ప్రక్రియ కొనసాగుతుందని సి.ఎస్ తెలిపారు.

శంకుస్థాపన జరిగే 28 నియోజక వర్గాలు

శంకుస్థాపన జరగనున్న నియోజక వర్గాలు: కొడంగల్, మధిర, హుస్నాబాద్, నల్గొండ, హుజూర్‌నగర్, మంథని, ములుగు, పాలేరు, ఖమ్మం, వరంగల్, కొల్లాపూర్, అందోల్ చాంద్రాయణగుట్ట, మంచిర్యాల, భూపాలపల్లి, అచ్చంపేట్, స్టేషన్ ఘన్‌పూర్, తుంగతుర్తి, మునుగోడు, చెన్నూరు, షాద్‌నగర్, పర్కాల, నారాయణ్ ఖేడ్, దేవరకద్ర, నాగర్ కర్నూల్, మానకొండూర్, నర్సంపేట

# పథకాలను యువత సద్వినియోగం చేసుకోవాలి

**జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్**



మహబూబాబాద్ జిల్లా, అక్టోబర్ 10 (తీన్మార్ న్యూస్): ప్రభుత్వ పథకాలను యువత సద్వినియోగం చేసుకొని ఉపాధి పొందాలన్నారు, జిల్లా కలెక్టర్, గురువారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో (డిఐపిసి) జిల్లా స్థాయి ఇండస్ట్రియల్ ప్రమోషన్ కమిటీ, సమావేశం జరిగింది, ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ టీ - ప్రైడ్ స్కీమ్ ద్వారా జిల్లాలోనీ షెడ్యూల్ ట్రైబ్ (ఎస్టీ) 25 మందికి రూపాయలు-67, 81,379, లక్షలు, షెడ్యూల్ క్యాస్ట్ (ఎస్సి) 02, మందికి రూపాయలు -5,73, 165, లక్షలు, మొత్తం 73,లక్షల 54వేల 544/- రూపాయల నిధుల కేటాయింపు కోసం కమిటీ, ప్రభుత్వ నిబంధనల ప్రకారం (27) మంది ఎస్సి,ఎస్టీ, లబ్ధిదారులకు సబ్సిడీ ఋణాల ప్రతిపాదనలు పంపమన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు పిఎం విశ్వకర్మ, టీ ప్రైడ్, తదితర సౌకర్యాల ద్వారా జిల్లాలోని యువతీ, యువకులు వ్యాపార రంగాల్లో ప్రవేశించి ఉపాధి అవకాశాలను పొందాలని సూచించారు. పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో వాటర్ ప్లాంట్, పౌల్ట్రీ ఫామ్, రైస్ మిల్లు, జేసిబి, లారీలు, చిల్లి వ్యాపారం తదితర వాణిజ్య వ్యాపారాలు ఉన్నాయని, ప్రజలు ఉపయోగించుకోవాలన్నారు. యువతి,యువకులు, ప్రజలకు ప్రభుత్వం నుండి వచ్చే పథకాలపై పూర్తి అవగాహన కల్పించాలని సంబధిత అధికారులకు సూచించారు. భారీ వర్షాలు, వరదల కారణంగా దెబ్బతిన్న గ్రామాల్లో ప్రజలకు తమ పరిధిలో ఉన్న ప్రభుత్వ పథకాల ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ జిఎం ఏ.సత్యనారాయణ, ఎన్పిడీసీఎల్ ఎస్ఈ నరేష్, ఎస్టీ, ఎస్సి, సంక్షేమశాఖల అధికారులు, ఆర్డీవో సాయి చరణ్, సంబధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పుండు ఎక్కడుంటే మందు ఎక్కడ పెడుతున్నారో చెప్పండి

**కాటపల్లి వెంకటరమణారెడ్డి కామారెడ్డి ఎమ్మెల్యే**

హైదరాబాద్: హైదరాబాద్ లో నివసించే బీద ప్రజలు హైడ్రా భయం తో మా ఇండ్లు ఉంటాయా, పోతాయా అనే భయం తో బ్రతుకుతున్నారు. హైడ్రా వాళ్ళ మంచి జరుగుతుందా చెడు జరుగుతుందా అనేది పక్కన పెడితే సోషల్ మీడియా వేదికగా పార్టీలు వేరేయినంత మాత్రాన ఇష్టం వొచ్చినట్టు విమర్శించడం తగదు అని నా సూచనని కామారెడ్డి ఎమ్మెల్యే కాటపల్లి వెంకటరమణా రెడ్డి అన్నారు. సోషల్ మీడియా వేదికగా వొస్తున్న కామెంట్స్ చూస్తే సిగ్గు అనిపిస్తుంది. హైడ్రా విషయం తీసుకుంటే రేవంత్ రెడ్డి ని విమర్శించడం నా ఉదేశ్యం కాదు. మొదట ఇండ్లు కట్టడానికి అనుమతులు ఇచ్చిన అధికారుల మీద చర్యలు తీసుకోవాలని బీజేపీ తరపున డిమాండ్ చేసాము. హెచ్ ఎమ్ డి ఏ పరిధిలో ఉన్న చెరువులను తీసుకొని బఫ్ఫార్ జోన్ లను సర్వే మొత్తం పూర్తి కాలేదు. చెరువుల బఫ్ఫార్ జోన్ ల సర్వే ఇంకా ఎన్ని రోజులు పడుతుందో అసలు చేయగలుగుతారో తెలియదు. కానీ చెరువులు మాత్రం కబ్జా ఆగటం లేదు. రాను రాను చెరువులు మాయం అవుతున్నాయి. ముఖ్యమంత్రి పక్కన అధికారులను కూర్చో బెట్టుకొని ప్రెసెంటేషన్ ఇచ్చారు. 2014 నుండి 2023 వరకు ఉన్న విషయాలు మాత్రమే మాట్లాడుతున్నారు. అంటే ప్రజా సమస్యలు వొదిలేసి గత ప్రభుత్వం చేసిన అక్రమలే ప్రదానం గా మాట్లాడుతున్నారు. అలా అని నేను గత ప్రభుత్వాన్ని సపోర్ట్ చేయటం లేదు. సెప్టెంబర్ 2024 వరకు 95 లేక్స్ కు ఫైనల్ నోటిఫికేషన్ ఇచ్చారు. ఇచ్చిన నోటిఫికేషన్ లు అనైతకం. దానికి పారదర్శకత లేదు. 2-9-2024 రోజు హైడ్రా వాళ్ళు ప్రిలిమినేరీ నోటిఫికేషన్ ఇచ్చారని అన్నారు.

బండ్ల గూడా లో ఒక్క ఎకరం కంటే తక్కువ ఉన్న స్థలాన్ని చెరువు గా నిర్ణయాలు తీసుకోవడం మరి బట్టి విక్రమార్క కి తెలుసా లేకపోతే అధికారులు తప్పు దోవ పట్టించారా. గండి పేట్ లో అక్రమంగా చెరువు స్థలం లో విల్లాలు నిర్మిస్తే వారికి కనపడలేదు. నేను ఈ విషయాల్లో కనక తప్పుగా మాట్లాడితే వెంటనే రాజీనామా చేస్తా చెరువు కబ్జా చేసారు అని చెబుతున్నారు కానీ దానికి కారణం ఎవరు అని చెప్పటం లేదు. బి ఆర్ ఎస్ వాళ్ళు కాంగ్రెస్ ను, కాంగ్రెస్ వాళ్ళు బి ఆర్ ఎస్ వాళ్ళను తిట్టుకోవడం తప్ప రాష్ట్రం లో ప్రజా సమస్యలు గాలి కోదిలేశారుని అన్నారు,.

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలి పుండు ఎక్కడుంటే మందు ఎక్కడ పెడుతున్నారో చెప్పండి. పేద ప్రజలకు ఇల్లు కట్టిద్దాం ప్రతిపక్షాలు కలిసి రావాలని పిలుపునిచ్చే నీకు వారి ఇండ్లు కూలగొట్టేటప్పుడు వారితో కలిసి కూర్చొని మాట్లాడాలనే ఆలోచన రాలేదా. ఒక పేదవాడు తనకు కలిగిన దాంట్లో భార్యా పిల్లలతో చక్కగా జీవించే వారి ఇండ్లు కూలగొట్టి వారికి బాధను మిగిల్చావు. మీ ఎమ్మెల్యేలు 63 మంది మా ఎమ్మెల్యేలు పదిమంది గడిచిన గత పది నెలలుగా తీసుకున్న జీతాలన్నీ ఇప్పుడు కులగొట్టిన ప్రజలకు ఇల్లు కట్టించే విషయంలో పెడదామని అన్నారు.

# మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

**- తీరొక్క పూలతో బతుకమ్మల అలంకరణ**
**- ఆడి-పాడిన మహిళా కాంగ్రెస్ నేతలు**
**మహిళలకు గాజులు,పండ్లు,పూలు వాయినంగా ఇచ్చిన కాంగ్రెస్ అమ్మాయిల నాయకురాలు**

హుజురాబాద్: హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం లొ తీరొక్క పూలతో ప్రకృతిని దైవంగా భావించి ఆడబిడ్డలు జరుపుకునే పండుగ బతుకమ్మ.అలాంటి బతుకమ్మ పండుగను జరుపుకున్నారు. హుజురాబాద్ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ ఆదేశాల మేరకు ఈ సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. ఏడాదికి ఒక్కసారి వచ్చే ఈ పూల జాతరకు కాంగ్రెస్ మహిళలు పెద్దఎత్తున వచ్చి పాల్గొని ఆడి,పాడారు. అత్యంత వైభవంగా జరిగిన ఈ బతుకమ్మ సంబరాలు చూపరులను ఆకట్టుకున్నాయి. ఈ సంబరంలో పాల్గొన్న మహిళలకు బ్లాక్ కాంగ్రెస్ మహిళ అధ్యక్షురాలు ఆలేటి సుశీల గాజులు, పూలు,పండ్లు పంపిణీ చేశారు. మహిళల కొలాటాలతో కాంగ్రెస్ పార్టీ కార్యాలయం పండుగ శోభను సంతరించుకుంది.కార్యక్రమంలో హుజూరాబాద్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షురాలు యేముల పుష్పలత జమ్మికుంట పట్టణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు పూదరి శివ-రేణుకా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షురాలు ఆలేటి సుశీల ఇల్లంతకుంట మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కొడం రజిత, మహిళా విభాగం నాయకురాల్లు పుల్ల రాధ, కడారి తిరుమల, మల్లీశ్వరి, మంద మంజుల, చిదిరాల సునిత, సొల్లు సునిత, యండి కరీమా, తోటస్వప్న, రజిత స్వరూప, రిబ్కా, హుజూరాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొల్లూరి కిరణ్ కుమార్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సొల్లు బాబు, సోషల్ మీడియా ఇన్చార్జి మిడిదొడ్డి రాజు, ఉప్పరి శ్రీనివాస్, పటేల్ తాళ్ళపెల్లి రమేష్, ఎర్ర రవీందర్, గంట కిరణ్ రెడ్డి, యండి షాధిక్, యండి రియాజ్, తదితరులు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# భార్య లంచాలపై భర్త హోం టూర్

హైదరాబాద్: భార్య అక్రమాలను భర్త వెలుగులోకి తీసుకొచ్చాడు. అవినీతి పాల్పుడుతున్న భార్య కోట్లు దోచుకుంటుందని తెలియజేస్తూ ఓ హోంటూర్ వీడియో చేశాడాయన. తమ ఇంట్లో ఎక్కడ చూసినా డబ్బుల కట్టలే ఉన్నాయంటూ చెప్పుకొచ్చారు. తన ఇంట్లోనే కాకుండా ఆమె సోదరులకు కూడా లక్షలు ఇస్తోందని ఖాతాల్లో జమ చేస్తోందని వీడియోలో ఆరోపించారు. మణికొండ మున్సిపల్ డీఈఈగా పని చేస్తున్న దివ్య జ్యోతి అక్రమాలకు పాల్పడుతోందని ఆరోపించారు భర్త. కాంట్రాక్టర్లతో కుమ్మక్కై కోట్లు కూడబెడుతోందని చెప్పుకొచ్చారు. దివ్యజ్యోతి అవినీతిపై ఆయన ఏకంగా హోం టూర్ లాంటి వీడియో చేశారు. ఇంట్లోని ప్రతి మూలను చూపిస్తూ ఎక్కడెక్కడ డబ్బు కట్టలు ఉన్నాయో చెప్పుకొచ్చారు. దివ్యజ్యోతి ప్రతి రోజూ ఇంటికి భారీగా లంచం డబ్బు తెస్తుందని ఆధారాలతో వెలుగులోకి తీసుకొచ్చాడు భర్త. కమిషన్ల రూపంలో భారీగా అక్రమాలకు పాల్పడుతోందని ఆరోపించారు. ముందుగా ఓ కవర్‌లో ఉన్న డబ్బులతో మొదలు పెట్టారు. అందులో ఉన్న డబ్బులు వీడియోలో చూపించారు. తర్వాత దేవుడి గదికి వెళ్లారు. దేవుడి పూజ చేసుకునే పీఠ వెనకాల దాచిన డబ్బు కట్టలు బయటకు తీసి చూపించారు. ఇలా ఏ మూలన చూసిన డబ్బులు దొరుకుతాయన్నారు. ఆమె భారీగా ఇంటికి డబ్బులు తీసుకురావడమే కాకుండా తన అన్నదమ్ములకు కూడా డబ్బులను ఇస్తోందని చెప్పుకొచ్చారు. అందులో ఒక వ్యక్తి పేరు శరత్ అని వివరించారు.

తర్వాత వీడియోను కిటికీ పక్కనే ఉన్న ర్యాక్‌పై చూపించారు. అక్కడ ఓ కవర్‌లో ఉన్న డబ్బులు చూపించారు. తర్వాత ర్యాక్ సెల్ఫ్‌లు తీసి అందులో ఉన్న డబ్బులు చూపించారు. డబ్బులు లేకపోతే గౌరవం ఉండదని అమె తరచూ అంటోందన్నారు దివ్యజ్యోతి భర్త. ఆ డబ్బు ఉంటే ఏదైనా సాధ్యమేనంటూ మాట్లాడుతుందన్నారు. డబ్బు కారణంగానే ఎవరి మాటా వినకుండా ఇష్టం వచ్చినట్టు చేస్తోందని తెలిపారు. పద్దతి మార్చుకోవాలని వారించినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బంధువుల వద్ద తన సంగతి చెబుతానంటూ వార్నింగ్ ఇచ్చిందని అందుతే దివ్యజ్యోతి సంగతి తేల్చాలనే ఈ వీడియో చేస్తున్నట్టు చెప్పారు. ఈ వీడియోతో ఆమె అవినీతి బాగోతాన్ని బయటపెట్టానంటున్నారు.

# పోస్టు మ్యాన్ నిర్లక్ష్యం...

**ఇంటర్వ్యూ లెటర్ ఆలస్యం, జాబ్ కోల్పోయిన యువకుడు**


మహబూబ్ నగర్: పోస్టల్ శాఖ నిర్లక్ష్యం కారణంగా ఓ యువకుడు ప్రభుత్వ ఉద్యోగం కోల్పోయాడు. అహర్నిశలు శ్రమించి ప్రిపేరయ్యాడు. తీరా జాబ్ చేతికొచ్చే సమయంలో జరిగిన ఘటన ఆ అభ్యర్థికి ఉద్యోగాన్ని దూరం చేసింది. ఈ ఘటన మహబూబ్ నగర్ జిల్లాలో జరిగింది. మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్ల మండలం గంగాపూర్ కి చెందిన నాగరాజు అనే యువకుడు రాష్ట్ర విద్యుత్ శాఖలో సబార్డినేట్ పోస్టుకు దరఖాస్తు చేసుకున్నాడు. ప్రక్రియ దాదాపు పూర్తయింది. అధికారులు గత నెల సెప్టెంబర్ 27 లోపు ఇంటర్వ్యూకి హాజరు కావాలని అభ్యర్థి నాగరాజుకి కాల్ లెటర్ స్పీడ్ పోస్ట్ ద్వారా పంపించారు. కానీ ఆ ఇంటర్వ్యూ లెటర్ పోస్ట్ బాధితుడు నాగరాజుకు అక్టోబర్ 4న అందింది. అంతకు దాదాపు పది రోజుల ముందు రావాల్సిన సబార్డినేట్ పోస్ట్ ఇంటర్వ్యూ లెటర్ ఆలస్యంగా రావడంతో నాగరాజు ఆ ఉద్యోగాన్ని కోల్పోయాడు. దాంతో అధికారులు నాగరాజు బదులుగా ఇంటర్వ్యూకు హాజరైన మరో అభ్యర్థికి పోస్టింగ్ ఇచ్చారు.జరిగిన ఘటనతో అభ్యర్థి నాగరాజుతో పాటు అతడి కుటుంబసభ్యులు షాక్ అయ్యారు. చేతి వరకొచ్చిన కూడు నోటికి రాకుండా అడ్డుకున్నారు అనే తీరుగా... ఇంటర్వ్యూ కాల్ లెటర్ అధికారులు స్పీడ్ పోస్టులో పంపించినా, పోస్టల్ శాఖ, పోస్ట్ మ్యాన్ నిర్లక్ష్యంతో ప్రభుత్వ ఉద్యోగం కోల్పోయామని నాగరాజు, అతడి కుటుంబసభ్యులు తెలిపారు. గవర్నమెంట్ కోల్పోవడానికి పోస్టల్ శాఖనే కారణమంటూ సంబంధిత శాఖ అధికారులతో అభ్యర్థి నాగరాజు, అతడి కుటుంసభ్యులు వాగ్వాదానికి దిగి, న్యాయం ఎలా జరుగుతుందని ప్రశ్నించారు. ఉన్నతాధికారులు, సంబంధిత శాఖ ఏమైనా స్పందించి అభ్యర్థి నాగరాజుకు ఏమైనా సహాయం చేస్తుందా అనేది తెలియాలంటే వేచి చూద్దాం.

# సీపీఐ(ఎం) జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

**- సీపీఐ(ఎం) పార్టీ జిల్లా కార్యదర్శి వెంకట్ గౌడ్**

కామారెడ్డి: అక్టోబర్ 19న జరిగే సీపీఐ(ఎం) పార్టీ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కామారెడ్డి జిల్లా కార్యదర్శి వెంకట్ గౌడ్ అన్నారు. గురువారం జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సీపీఐ(ఎం) పార్టీ శాఖ మహాసభల నుండి అఖిల భారత మహాసభల వరకు జరుగుతున్నాయని మహాసభలలో ప్రజా సమస్యలపై భవిష్యత్తులో పోరాటాలు రూపోదించుకుంటామని, కామారెడ్డి జిల్లా మహాసభలు అక్టోబర్ 19 కామారెడ్డి పట్టణంలో జరుగుతాయని, ఈ మహాసభలకు పార్టీ గ్రామ స్థాయి నాయకులు, పార్టీ శ్రేణులు హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు మోతిరాం నాయక్, చంద్రశేఖర్,కొత్త నర్సింలు అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# దుబ్బాక ప్రజలు సుభిక్షంగా ఉండాలి: చెరుకు



దుబ్బాక : నియోజకవర్గంలో పంటలు బాగా పండి ప్రజలు సుభిక్షంగా ఉండాలని దుర్గామాతను వేడుకున్నట్లు కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. బుధవారం దుబ్బాక పట్టణ కేంద్రంలోని యువకిరణం స్పోర్ట్స్ అసోసియేషన్ వారు నెలకొల్పిన దుర్గాదేవి మండపం వద్ద నిర్వహించిన అన్నప్రసాద వితరణ కార్యక్రమానికి శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా ఆయనను మండప నిర్వాహకులు శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అనంతుల శ్రీనివాస్,కొంగర రవి,కడ్దూరి నరేందర్ రెడ్డి,మచ్చ శ్రీనివాస్,శ్రీరామ్ నరేందర్,బిళ్ళ బాలరాజు,ఐరేని సాయితేజ గౌడ్, పలువురు పాల్గొన్నారు.

# ఎస్సీ వర్గీకరణ పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలి

**- ప్రజాసంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పేట భాస్కర్**

కోరుట్ల: దేశ అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీం కోర్టు ఆగస్టు ఫస్ట్ న ఎస్సీ, ఎస్టీల వర్గీకరణపై ఇచ్చిన సంచలనాత్మక తీర్పును గౌరవిస్తూ తెలంగాణ అసెంబ్లీ నిండు సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణలో వర్గీకరణ అమలు చేస్తామని ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని తెలంగాణ ప్రజాసంఘాల జేఏసీ, అంబేద్కర్ సంఘాల రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పేట భాస్కర్ ముఖ్యమంత్రిని కోరారు.
బుధవారం కోరుట్ల పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద డిస్సీ ఫలితాల్లో ఎస్సీ వర్గీకరణ అమలు చేయక పోవడాన్ని నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా మాదిగలు చేస్తున్న నిరసనలో భాగంగా అంబేద్కర్ మాదిగ సంఘం అధ్యక్షుడు శనిగారపు రాజేష్ ఆద్వర్యంలో జరిగిన నిరసన కార్యక్రమంలో పాల్గొన్న పేట భాస్కర్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణను అన్ని ప్రభుత్వ రంగాలతో పాటు డిఎస్సీ లో సైతం వర్గీకరణ చేస్తామన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట నిలుపుకోవాలని బుధవారం ఇవ్వనున్న డిఎస్సీ నియామకపు పత్రాలలో ఎస్సీ లకు సంబంధించిన 15 శాతం నియామకాలను అపివేయాలని వర్గీకరణ చేశాకే ఇవ్వాలని కోరారు. జనాభా ప్రాతిపదికన ఎస్సీ కులాల న్యాయ బద్ధమైన పోరాటంలో విఘాతం కలిగించే ప్రయత్నాలు మానుకోవాలని వర్గీకరణపై వేసిన అనేక రివ్యూ పిటిషన్లను సుప్రీం కోర్టు కొట్టివేసిందని ఇది మాల, మాదిగల పంచాయతీ ఏ మాత్రం కాదని ఎస్సీల లోని 59 కులాల సమాంతర ఫలాల పంపిణీ పోరాటం అని పేట భాస్కర్ అన్నారు. అంతకు ముందు అంబేద్కర్ భవన్లో బహుజన పితామహుడు మాన్య కాన్షీరాం వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ మాదిగ కుల సంఘం అధ్యక్షులు శనిగారపు రాజేష్, మండల అధ్యక్షులు జాగర్ల రాజయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్ రాజయ్య, సీనియర్ నాయకులు మారంపెల్లి నర్సయ్య, బొల్లే గంగాధర్, తాళ్లపెల్లి రాజగంగారాం, చిట్యాల మధు, వొటారికారి సాయన్న, రాజేందర్, బైరి రవిదాస్,ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# మరిపెడ పోలీస్ స్టేషన్ ను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాధ్ కేకన్

మహబూబాబాద్: మహబూబాబాద్ జిల్లాలోని మరిపెడ పోలీస్ స్టేషన్ ను జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాధ్ కేకన్ ఐ పి ఎస్ ఆకస్మిక తనిఖీ నిర్వహించడం జరిగింది. అనంతరం పోలీసు స్టేషన్ రికార్డులను పరిశీలించి, పరిసరాల ను పర్యవేక్షించి, 5 ఎస్ ఇంప్లి మెంటేషన్ విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ స్టేషన్ సిబ్బందితో మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్నటు వంటి సస్పెక్ట్, హిస్టరీ షీటర్ ల కదిలికలను చెక్ చేయాలని, యాక్టివ్ గా ఉన్నటు వంటి వారందరూ ఎలాంటి కార్య కలాపాలు చేస్తున్నారో చెక్ చేయాలని సూచిస్తూ, నేరాలకు అలవాటు పడిన నేరస్తుల షీట్ ఓపెనింగ్ కోసం ప్రపోజల్స్ పంపాలని స్టేషన్ హౌస్ ఆఫీసర్ కు సూచిస్తూ , దీర్ఘ కాలంగా పెండింగ్లో ఉన్న ఎన్ బి డబ్ల్యు లు త్వరగా ఎగ్జిక్యూట్ అయ్యే విధంగా ప్రత్యేక టీం ఏర్పాటు చేసి ఎగ్జిక్యూట్ అయ్యే విధంగా చూడాలని ఆదేశిస్తూ, సిబ్బంది ప్రతి ఒక్కరు తమకు కేటాయించిన విధులను బాధ్యతతో నిర్వహించాలని సూచిస్తూ, తరచూ జరుగు తున్న సైబర్ నేరాల గురించి ఆయా గ్రామాలలో కాలనీలలో, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. అనంతరం జిల్లా ప్రజను ఉద్యేశించి ఎస్పీ మాట్లాడుతూ సైబర్ నేరాలకు గురి అవుతున్న వారిలో అధికంగా విద్యావంతులే ఉంటున్నారని, అత్యాశకు పోయి అనవసర లింక్ లు ఓపెన్ చేయకూడదని, ఆన్లైన్ లో అపరిచితులతో పరిచయాలకూ దూరంగా ఉండాలని , సైబర్ నేరాలకు గురైనట్లైతే 1930 లేదా సైబర్ క్రైమ్ పోర్టల్ ఫిర్యాదు చేయాలన్నారు. ముఖ్యంగా జిల్లాలో డ్రగ్ నిర్మూలనకు జిల్లా పోలీసు శాఖ తరపున ప్రత్యేక చొరవ తీసుకోవడం జరుగుతుందని, జిల్లాలో మాదక ద్రవ్యాల ఆనవాళ్లు ఉన్న, అక్రమ రవాణా చేసిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని అన్నారు.

# ఛెరువుల లెక్కలు తేల్చే పనిలో హైడ్రా...

హైదరాబాద్: కబ్జాలకు గురైన చెరువులను గుర్తించేందుకు హైడ్రా భారీ కసరత్తు చేస్తోంది. ఇందుకోసం వివిధ ప్రభుత్వం సంస్థల సహకారం తీసుకోవాలని నిర్ణయించింది. సర్వే ఆఫ్ ఇండియా కార్యాలయానికి వెళ్లిన హైడ్రా కమిషనర్ రంగనాథ్.. దశాబ్దాల క్రితం నాటి మ్యాప్‌లను పరిశీలించారు. అందులోని చెరువులు, నాలాల ప్రస్తుత పరిస్థితి ఏ విధంగా ఉందనే అంశంపై సమీక్షించారు.గొలుసు కట్టు చెరువులకు ప్రసిద్ధి చెందిన హైదరాబాద్ మహానగరంలో అసలు ఎన్ని చెరువులుండేవి?. ఇప్పుడు ఎన్ని ఉన్నాయనే లెక్కలు తేల్చేందుకు సర్వే ఆఫ్ ఇండియాతో కలిసి హైడ్రా పని చేస్తోంది. ఈ క్రమంలో తెలంగాణలో చెరువులను గుర్తించేందుకు సర్వే ఆఫ్ ఇండియా కార్యాలయంలో హైడ్రా అధికారులు సమీక్ష చేపట్టారు. సర్వే ఆఫ్ ఇండియా కార్యాలయానికి మంగళవారం హైడ్రా అధికారుల బృందంతో వెళ్లారు కమిషనర్ రంగనాథ్.సర్వే ఆఫ్ ఇండియా ఉన్నతాధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సర్వే ఆఫ్ ఇండియా రూపొందించిన పాత మ్యాప్‌లను కమిషనర్ రంగనాథ్ పరిశీలించారు. 1971-72 సర్వే ప్రకారం నగరంలో ఎన్ని చెరువులు ఉన్నాయి ? చెరువులు ఎంత విస్తీర్ణంలో ఉండేవి ? ప్రస్తుతం వాటి పరిస్థితి ఏంటి? నాలాలు ఎలా.. ఎంత విస్తీర్ణంలో ఉండేవి ? ఇప్పుడు ఎంత మేర కబ్జా అయ్యాయి అనే అంశాలను మ్యాప్‌ల ద్వారా పరిశీలిం చారు. దశాబ్దాల క్రితం నాటి మ్యాప్‌లతో పాటు.. నేటి పరిస్థితిని సరిపోల్చుతూ చెరువులు, నాలాల వివరాలను పవర్ పాయింట్ ప్రదర్శన ద్వారా కమిషనర్‌కు వివరించారు సర్వే ఆఫ్ ఇండియా అధికారులు. ఇప్పటికే హెచ్ఎండీఏ, ఇరిగేషన్, జీహెచ్ఎంసీ నుంచి సేకరించిన చెరువుల జాబితాతో.. సర్వే ఆఫ్ ఇండియా వద్ద ఉన్న సమాచారాన్ని క్రోఢీకరించి చెరువులు, నాలాల పరిస్థితి, కనుమరుగైన చెరువులపై అవగాహన కల్పించారు. శాస్త్రీయ పద్ధతిలో ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ ఫిక్స్ చేయాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో చెరువులను ఆక్రమించి కట్టిన మరిన్ని కట్టడాలను హైడ్రా కూల్చివేసే అవకాశం ఉందని తెలుస్తోంది.

# రాడార్ కేంద్రంతో వినాశనమే

**- మిచిగావ్ అనుభవం చెబుతున్నదదే**

**- దామగుండం పరిరక్షణకు ప్రజాస్వామ్యయుత ఉద్యమం**

**- మేధావులు, పర్యావరణవేత్తల్లారా కదలిరండి**

**- వద్దంటూ ట్వీట్ క్యాంపెయిన్‌కు పిలుపు: దామగుండం పరిరక్షణ సమితి జేఏసీ రౌండ్‌టేబుల్‌లో వక్తలు**

హైదరాబాద్: రాడార్ కేంద్రం ఏర్పాటుతో వినాశనమే తప్ప తెలంగాణ అభివృద్ధికి ఏమాత్రం ఉపయోగం ఉండదని పలువురు వక్తలు నొక్కి చెప్పారు. ప్రజలు వద్దని గగ్గోలు పెట్టినా వినకుండా అమెరికాలో మిచిగావ్‌లో ఇదే తరహాలో పెట్టిన కేంద్రాన్ని రెండేండ్లకే మూసేశారని తెలిపారు. ప్రత్యామ్నాయ టెక్నాలజీ అందుబాటులో ఉన్న తర్వాత కూడా ఆ కేంద్రం ఎందుకని ప్రశ్నించారు. దామగుండం పరిరక్షణ కోసం ప్రజాస్వామ్యయుత ఉద్యమం రూపొందిస్తామని చెప్పారు. హైదరాబాద్‌కు కూతవేటు దూరంలో ఉన్న అడవి ధ్వంసానికి గురి కాబోతున్నా పట్టదా? మేధావుల్లారా.. పర్యావరణ వేత్తల్లారా.. ప్రజల్లారా ఉద్యమంలో కలిసి రండి అని పిలుపునిచ్చారు. అవసరమైతే ఆమరణ నిరాహార దీక్షకు కూడా వెనుకాడబోమని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను హెచ్చరించారు. పచ్చటి అడవిని ధ్వంసం చేసి రాడార్ కేంద్రం ఏర్పాటు చేయొద్దనీ, రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకునేలా ఆదేశించాలని కోరుతూ రాహుల్‌గాంధీకి, కాంగ్రెస్ అగ్రనేతలకు ట్వీట్లు చేసే క్యాంపెయిన్‌కు పిలుపునిచ్చారు. బుధవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మహిళలు, ట్రాన్స్‌జెండర్ల ఐక్య కార్యాచరణ వేదిక ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. పీఓడబ్ల్యూ జాతీయ కన్వీనర్ వి.సంధ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త, డాక్టర్ బాబూరావు మాట్లాడుతూ అణుయుద్ధాల కోసమే రాడార్ కేంద్రమనీ, దీని వల్ల వినాశనమే తప్ప అభివృద్ధి ఉండదని స్పష్టం చేశారు. పర్యావరణ క్లియరెన్స్ రిపోర్టును ఎందుకు బహిర్గతం చేయడం లేదని ప్రశ్నించారు. ఆ కేంద్రం నుంచి వెలువడే ఈఎల్ఏ తరంగాలు అత్యంత ప్రమాదకరమైనవని హెచ్చరించారు. రాడార్ కేంద్రం పెట్టడానికి ఎత్తైన, లోతట్టు ప్రాంతాలతో సంబంధం లేదనీ, పచ్చని అడవిని ఎందుకు ధ్వంసం చేయాలనుకుంటున్నారని నిలదీశారు. ఆ కేంద్రంతో ముమ్మాటికీ భూ, నీటి, వాతావరణ కాలుష్యాలు జరుగుతాయనీ, క్యాన్సర్ వ్యాధిగ్రస్తులు పెరిగే ప్రమాదం ఉంటుందని హెచ్చరించారు. దేవాదాయ భూమిని కాపాడాలని ఆర్ఎస్ఎస్, భజరంగ్‌దళ్ నాయకత్వాలను కలిస్తే కేంద్ర ప్రభుత్వ నిర్ణయం కాబట్టి తామేమీ చేయలేమని చెప్పడం అన్యాయమన్నారు. పైగా, స్వామిజీని అని కూడా చూడకుండా దేశద్రోహి, ఇక్కడుండవ్ అంటూ బెదిరింపులకు కొన్ని శక్తులు దిగడంపై ఆందోళన వ్యక్తం చేశారు. సామాజికవేత్త సజయ మాట్లాడుతూ రాడార్ కేంద్రం అడవిలోనే పెట్టాలని నిబంధన ఎక్కడైనా ఉందా? అని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి సర్కారు తీరుపై రాహుల్‌గాంధీ, కాంగ్రెస్ అగ్రనేతలకు ట్వీట్ చేయాలని పిలుపునిచ్చారు. పూడూరు మాజీ సర్పంచి లక్ష్మయ్య మాట్లాడుతూ పొద్దునలేస్తే దేవుడిపేరుతో రాజకీయం చేసే బీజేపీ నేతలు రామలింగేశ్వరస్వామి దేవాలయం విషయంలో ఎందుకు స్పందించడం లేదని నిలదీశారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే, బీజేపీ ఎంపీ, సీఎం ఒక్కటయ్యారనీ, అందుకే ఆ పార్టీల నాయకులు సప్పుడు చేయడం లేదని అన్నారు. దామగుండ పరిరక్షణ సమితి కన్వీనర్ గీత మాట్లాడుతూ..
దామగుండం ఉద్యమాన్ని దేశవ్యాప్త పోరాటంగా మలుస్తామన్నారు. మానవ మనుగడకు ప్రమాదకర ప్రాజెక్టులు అవసరమా? అని ప్రశ్నించారు. తెలంగాణకు భవిష్యత్తులో జరిగే నష్టానికి వ్యతిరేకంగా పోరాడుతుంటే నిందలు మోపడం తగదన్నారు. ఎన్ఏపీఎమ్ నాయకులు మీరా సంఘమిత్ర మాట్లాడుతూ..ప్రజాభిప్రాయ సేకరణ లేకుండా అంత పెద్ద ప్రాజెక్టుకు రెండుమూడు రోజుల్లో క్లియరెన్స్ సర్టిఫికెట్ ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. దేవాదాయ భూములను చట్టవిరుద్ధంగా అటవీశాఖకు ఎలా మార్చారని నిలదీశారు. కార్యక్రమంలో ఝాన్సీ, బి.విజయ, శాంతి, గిరిజ, దామగుండం జేఏసీ నాయకులు సిద్ధార్థ్, సూర్య, ప్రసన్న, అనన్య, లిఖిత, రుచిత్, తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే 'జారే'

**- గెలలు మద్దతు ధరపై కార్యాచరణ..**

**- ఆంధ్రా, తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రులతో కేంద్రంతో సంప్రదింపులు..**

**- 12న పరిశ్రమ విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ప్రారంభం..**

**- ముఖ్య అతిథిగా మంత్రి తుమ్మల హాజరు..**

**- ఆయిల్ ఫాం సాగుపై అవగాహన సదస్సు..**

**- పనులను పరిశీలించిన ఎమ్మెల్యే జారే..**



అశ్వారావుపేట: పామాయిల్ గెలలు మద్దతు ధర కొరకు కార్యాచరణ దిశగా ప్రయత్నాలు చేస్తున్నాం అని, ఇందుకోసం తెలంగాణ %-% ఆంధ్ర వ్యవసాయ శాఖ మంత్రులు సహాయంతో కేంద్రంపై సంప్రదింపు జేసే విధంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కృషి చేస్తున్నారని స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. నియోజక వర్గం కేంద్రం అయిన అశ్వారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని ఈనెల 12వ తేదీన ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే జారే ఆదినారాయణ తెలిపారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర వ్యవసాయ, హేండ్లూం, కో %-% ఆపరేటివ్, టెక్స్టైల్ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో పాటు ఆయిల్ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, ఎండీ యాస్మిన్ బాషా లు హాజరవుతారని చెప్పారు. అనంతరం ఆయిల్ ఫాం సాగు విస్తరణ, తోటలు నిర్వహణపై ఐఐఓపీఆర్ నిపుణులతో అవగాహన సదస్సు ఉంటుందని తెలిపారు. ఈ మేరకు ఫ్యాక్టరీ లో విద్యుత్ ఉత్పత్తి కేంద్రంతో పాటు ఆయిల్ ఫాం రైతు సదస్సు ఏర్పాట్ల ను బుధవారం ఎమ్మెల్యే పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆయిల్ ఫెడ్ పై విద్యుత్ భారం తగ్గించుకునేందుకు స్వంతంగా రూ.30 కోట్లకు పైగా నిధులతో 2.5 మెగా వాట్స్ సామర్థ్యంతో విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని నిర్మించినట్లు వివరించాడు. ఆయిల్ ఫాం రైతు సదస్సుకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర రైతు సంఘం నేతలతో పాటు పలు ప్రయివేట్ కంపెనీ బాధ్యులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ఆయిల్ ఫాం రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఆయన వెంట ఆయిల్ఫెడ్ డివిజనల్ ఆఫీసర్ ఆకుల బాలకృష్ణ,మేనేజర్ లు నాగబాబు,కళ్యాన్ గౌడ్,పవన్,గోపాల క్రిష్ణ,రాధాక్రిష్ణ,ఆయిల్ఫెడ్ అడ్వైజరీ బోర్డు సభ్యులు,రాష్ట్ర ఆయిల్ ఫాం రైతు వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఆలపాటి రామచంద్ర ప్రసాద్,సుంకవల్లి వీరభద్రరావు, అశ్వారావుపేట సొసైటీ అద్యక్షులు చిన్నంశెట్టి సత్యనారాయణ,మొగళ్ళపు చెన్నకేశవ రావు,తుమ్మ రాంబాబు,బండి భాస్కర్,జూపల్లి ప్రమోద్, ఆళ్ళ నాగేశ్వరరావు,కానూరి మోహన్ రావు,జీవన్ రావు లు ఉన్నారు.

# విద్యారంగంలో వస్తున్న మార్పుల గమ్యం ఎటువైపు..?

**- విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలి**



ఆదిలాబాద్ టౌన్: విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని విద్యాపరక్షణ కమిటీ రాష్ట్ర కన్వీనర్ ఎం శ్యాముల్ డిమాండ్ చేశారు. పట్టణంలోని ప్రభుత్వ డైట్ కళాశాలలో తెలంగాణ విద్యాపరక్షణ కమిటీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో విద్యారంగంలో వస్తున్న మార్పుల గమ్యం ఎటువైపు అనేదానిపై చర్చించారు. ఈ సందర్భంగా శ్యాముల్మాట్లాడుతూ.. విద్యారంగంలో కార్పొరేటకరణను ప్రోత్సహించే జాతీయ విద్యావిధానం ఎన్ఈపి 2020ని తిరస్కరించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం తన బడ్జెట్లో 10% రాష్ట్ర బడ్జెట్లో 20% నిధులు కేటాయించాలన్నారు. ఒకటో నుంచి మూడో తరగతి లకు అంగన్వాడీలో కలిపి ఆలోచన విరమించుకోవాలన్నారు. ప్రభుత్వం ఉన్నత పాఠశాలను సెమీ రెసిడెన్షియల్ గా మార్చి అన్ని వసతులు కల్పించాలని, పాఠశాల, కళాశాల స్థాయిలో విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న బోధన బోధ నేతల ఖాళీలు భర్తీ చేయాలన్నారు. కామన్ స్కూల్ విద్యావిధానాన్ని అమలు చేయాలని, నియోజవర్గంలో ఇంటర్నేషనల్ ఈ స్కూల్ ప్రతిపాదన వెంటనే ఉప సమరించుకోవాలన్నారు. సమావేశంలో డిటీఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్ వుకోదర్ సాయినాథ్, టిపిటీఎఫ్ జిల్లా అధ్యక్షులు రామేశ్వర్, ఐఎఫ్టీయూ జిల్లా కార్యదర్శి వెంకటనారాయణ, పిడిఎస్యు జిల్లా కార్యదర్శి గణేష్, టీఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు సంతోష్, ఏఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్, స్టూడెంట్స్ జెఏసి కన్వీనర్ రాహుల్, ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు తబ్రేజ్ ఖాన్, డిటీఎఫ్ నాయకులు సుధాకర్ నాగేందర్, దిలీప్, రాకేష్, అక్షయ్, దత్తు, వివిధ విద్యార్థి, సంఘాల నాయకులు ప్రజా సంఘాలు పాల్గొన్నారు.

# పారిశుధ్య కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యతనివ్వాలి

**- సఫాయి కర్మచారి జాతీయ కమిషన్ సభ్యులు డా. పీసీ వావా**

**- జీహెచ్ఎంసీ కార్యాలయంలో సమీక్ష**



సిటీ: పారిశుధ్య కార్మికుల ఆరోగ్య భద్రతకు, సంక్షేమానికి ప్రాధాన్యతనివ్వాలని సఫాయి కర్మచారి జాతీయ కమిషన్ సభ్యులు డాక్టర్ పీపీ.వావా అన్నారు. బుధవారం హైదరాబాద్ జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి కాట, ఆయా విభాగాల అధికారులు, వాల్మీకి అసోసియేషన్ ప్రతినిధులతో సమావేశమై పారిశుధ్య కార్మికుల సంక్షేమ కార్యక్రమాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా పలు సమస్యలను వాల్మీకి అసోసియేషన్ ప్రతినిధులు కమిషన్ సభ్యుల దృష్టికి తీసుకొచ్చారు. అలాగే పారిశుధ్య కార్మికులకు అమలవుతున్న పథకాలు, కార్యక్రమాల గురించి వావా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డా.పీపీ.వావా మాట్లాడుతూ.. అపరిశుభ్ర వాతావరణంలో విధులు నిర్వర్తించే పారిశుధ్య కార్మికుల ఆరోగ్య భద్రతకు, వారి సంక్షేమానికి పెద్దపీట వేయాలన్నారు. క్రమం తప్పకుండా వారికి ప్రత్యేకంగా ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేస్తూ, వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మెరుగైన సేవలు అందించాలని సూచించారు. కనీస వేతనాలు అమలయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. సఫాయి కర్మచారీల సమస్యలను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. మాన్యువల్ స్కావెంజర్ నిషేధ చట్టం గురించి ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. వారి పునరావాసానికి సంబంధించి ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సూచించారు.
ప్రతినిధులు ఇచ్చిన ఫిర్యాదులన్నింటిపై చర్యలు తీసుకుంటామని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి అన్నారు. వాల్మీకి అసోసియేషన్ ప్రతినిధులు ప్రతి బుధవారం సాయంత్రం 4 గంటలకు సమస్యలపై లిఖిత పూర్వకంగా తెలియజేయాలని సూచించారు. మాన్యువల్ స్కావెంజర్స్ ఎక్కడా లేరని, మాన్యువల్ స్కావెంజర్స్ నిషేధ చట్టం పకడ్బందీగా అమలవుతోందని తెలిపారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ, పారిశుధ్య కార్మికుల సేవలను వినియోగించుకుంటున్నామన్నారు. మహిళా కార్మికుల సంక్షేమానికి పలు చర్యలు తీసుకుంటున్నామని, జీహెచ్ఎంసీ పారిశుధ్య విభాగంలో అధికంగా మహిళలు పని చేస్తున్నందున వారి భద్రత కోసం కమిటీ(ఐసీసీ)లను ఏర్పాటు చేశామని జీహెచ్ఎంసీ కమిషనర్ చెప్పారు. శానిటేషన్ కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్‌తోపాటు హెల్త్ క్యాంప్స్‌ను సభ్యులు సూచించిన విధంగా ప్రతి మూడు నెలలకోసారి నిర్వహిస్తున్నామని వివరించారు. హాజరును పారదర్శకంగా నిర్వహిస్తూ వేతనాలను ప్రతినెలా 1న బ్యాంకు ఖాతాలో వేస్తున్నట్టు తెలిపారు. పాలసీ ఇష్యూ కావడంతో ప్రభుత్వానికి నివేదిక పంపుతామని కమిషన్ సభ్యులు వావాకు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషన్ సలహాదారులు వీరేంద్రనాథ్, అడిషనల్ కమిషనర్‌లు రఘు ప్రసాద్, పంకజ, నళిని, పద్మావతి, జోనల్ కమిషనర్లు హేమంత్ కేశవ్ పాటిల్, అపూర్వ చౌహాన్ రవికిరణ్, ఉపేందర్ రెడ్డి, వెంకన్న, వాల్మీకి అసోసియేషన్ ప్రతినిధులు, శానిటేషన్ వర్కర్లు పాల్గొన్నారు.

# ఫార్మసీ విద్యార్థులకు వెసులుబాటు

**- తెలంగాణ ఫార్మసీ మండలి వెల్లడి**

మిర్యాలగూడ: బీ ఫార్మసీ విద్యార్థులకు తెలంగాణ ఫార్మసీ బోర్డు ఫార్మసిస్ట్ గ్రేడ్ 2 దరఖాస్తులు చేసుకునేందుకు తెలంగాణ ఫార్మసీ మండలి పలు వెసులుబాట్లు కల్పించింది. అత్యవసర దృష్ట్యా స్లాట్ తేదీలతో సంబంధం లేకుండా తెలంగాణ ఫార్మసీ కౌన్సిల్ కార్యాలయాన్ని సందర్శించే అవకాశం కల్పించడంతో పాటు ఒరిజినల్ డిగ్రీ (ఓడి) సర్టిఫికెట్‌లకు బదులుగా తాత్కాలిక సర్టిఫికెట్ల ఆమోదంతో రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశాన్ని కల్పిస్తూ నిబంధనల్లో సడలింపు ఇచ్చింది. తెలంగాణ ఫార్మసీ బోర్డు అధికారులు స్పందించి అత్యవసర సమావేశం నిర్వహించారు. బోర్డు రిజెండర్ విడుదల చేశారు. దాని ప్రకారం రిజిస్ట్రేషన్ వెరిఫికేషన్లు ఒకటి రెండు రోజుల్లో మాత్రమే పూర్తి చేస్తామని, అత్యవసర దృష్ట్యా వెంటనే వాస్తవికత నిర్ధారణ నివేదికలను జారీ చేయాల్సిందిగా ఫార్మసీ కౌన్సిల్ జేఎన్టీయూహెచ్‌ని అభ్యర్థించింది. తెలంగాణ ఫార్మసీ కౌన్సిల్ ద్వారా డిగ్రీలు త్వరగా నమోదు చేసేందుకు అన్ని చర్యలూ తీసుకుంటున్నామని ప్రకటించింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా 165 బి ఫార్మసీ కళాశాలల్లో 2020-2024లో ఫార్మసీ ఉత్తీర్ణులైన సుమారు 8 వేల మందికి పైగా విద్యార్థులకు ఫార్మసిస్ట్ గ్రేడ్ 2 ఉద్యోగానికి దరఖాస్తు చేసుకునే అవకాశం కలిగింది.

# ఓటమి నుంచి కోలుకుని... తిరుగు లేని స్థాయికి

ఛండీఘడ్: పార్లమెంటు ఎన్నికల్లో కోలుకోలేని షాక్ తగిలింది. అధికారంలో ఉన్నప్పటికీ పార్లమెంట్ ఎన్నికల్లో ఓడిపోవడంతో భారతీయ జనతా పార్టీ నాయకత్వం తీవ్రమైన అంతర్మథనం లో పడిపోయింది. ఆ తర్వాత ఆ పార్టీలో అంతర్గత కలహాలు పెరిగిపోయాయి. దీంతో అసెంబ్లీ ఎన్నికల్లో అధికారంలోకి రావడం కష్టమనే అభిప్రాయం వ్యక్తం అయింది. మరోవైపు ఎగ్జిట్ పోల్స్ సంస్థలు కూడా బిజెపికి వ్యతిరేకంగా ఫలితాలను ప్రకటించాయిఅయితే వీటన్నింటిని పక్కనపెట్టి భారతీయ జనతా పార్టీ హర్యానాలో అధికారంలోకి వచ్చింది. పార్లమెంటు ఎన్నికల్లో తగిలిన ఎదురుదెబ్బ నుంచి త్వరగా కోలుకుంది. వేగంగా పుంజుకుని అధికారాన్ని దక్కించుకుంది. ముచ్చటగా మూడోసారి హర్యానా రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనుంది. సామాజిక ఇంజనీరింగ్ నుంచి ఎన్నికల వ్యూహాల వరకు.. అన్నింటికీ పదును పెట్టి.. తిరుగులేని స్థాయిలో నిలిచింది. ముఖ్యంగా మోడీ ? షా ఎప్పటికప్పుడు ఎన్నికల ప్రకటైనా పరిశీలించారు. పార్టీని ముందుండి నడిపించారు. అందువల్లే అంచనాలను మించి బిజెపి హర్యానాలో గెలిచింది. ఇటీవల పార్లమెంట్ ఎన్నికల్లో హర్యానా రాష్ట్రంలో బిజెపికి సీట్లు తగ్గాయి. దీనిని ఇలాగే ఉపేక్షిస్తే నష్టం మరింత తీవ్రంగా ఉంటుందని అధినాయకత్వం భావించింది. అందువల్లే అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపిక నుంచి మొదలుపెడితే కుల సమీకరణాల వరకు భారీ కసరత్తు చేసింది. జాతీయ పార్టీ నాయకులు, రాష్ట్రస్థాయి నాయకులు కలిసి హర్యానా ఎన్నికల్లో పనిచేశారు. వాస్తవానికి సర్వే రిపోర్టులు పార్టీకి వ్యతిరేకంగా ఉన్నప్పటికీ.. ప్రజలు మాత్రం కమలానికి జై కొట్టడం విశేషం.ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ కుల సమీకరణల విషయంలో పకడ్బందీ విధానాలను అవలంబించింది..జాట్ వర్గాన్ని తన వైపు తిప్పుకుంది. రెజ్లర్ల ఆందోళన నేపథ్యంలో ఓబీసీ వర్గాన్ని మచ్చిక చేసుకుంది. ఈ బాధ్యతను నాయబ్ సింగ్ షైనీ కి అప్పగించింది. దీంతో ఆ రాష్ట్రంలో జాట్ వర్సెస్ ఇతరులు అనే తీరుగా పోరాటం సాగింది. ఆ పోరాటంలో బిజెపి అత్యద్భుతంగా పై చెయ్యి సాధించింది. దళితుల్లో బలమైన జాటవ్ లు వెళ్ళినప్పటికీ.. మిగిలిన కులాల ఓట్లను బిజెపి దక్కించుకుంది. ఇక పంజాబీలు అగ్రకులాల ఓట్లు దక్కించుకోవడం కోసం బ్రాహ్మణ వర్గానికి చెందిన మోహన్లాల్ బదోలికి బిజెపి కీలక బాధ్యతలు అప్పగించింది. హర్యానా రాష్ట్రంలో పై వర్గాల ఓట్లు 7.5% వరకు ఉంటాయి. దీంతో 11 స్థానాలను ఈ వర్గానికి బిజెపి కేటాయించింది. హర్యానా రాష్ట్రంలో అగ్రకులాల వారు, పంజాబీలు దేశ విభజన తర్వాత ఇక్కడికి వచ్చి స్థిరపడ్డారు. వారంతా కూడా గ్రాండ్ ట్రంక్ రోడ్డు మార్గంలోని అర్బన్ నియోజకవర్గాలలో ఎక్కువగా నివాసం ఉంటున్నారు. 2014, 2019 ఎన్నికల్లో వీరు భారతీయ జనతా పార్టీకి ప్రధాన బలంగా నిలిచారు. అందువల్లే బిజెపి ఇక్కడ గెలవగలిగింది. మరోవైపు కాంగ్రెస్ జాట్ ? దళిత కూటమిని ఏర్పాటు చేసింది. బిజెపి యాంటీ జాట్ కూటమిని ఏర్పాటు చేయడంతో కాంగ్రెస్ పార్టీ తన వేగాన్ని తగ్గించాల్సి వచ్చింది. బిజెపి దూకుడు వల్ల జాట్ వర్గానికి చెందిన వ్యక్తిని ముఖ్యమంత్రిగా ప్రకటిస్తే.. అర్బన్ ఓట్లను కోల్పోవాల్సి వస్తుందని కాంగ్రెస్ పార్టీ ఆందోళన చెందింది. ఫలితంగా ముఖ్యమంత్రి అభ్యర్థి పేరు ప్రకటనను వాయిదా వేసింది . అది అంతిమంగా కాంగ్రెస్ పార్టీ ఓటమికి కారణమైంది.

# ఆప్ కు కలిసిరాని హర్యానా

న్యూఢిల్లీ: కాంగ్రెస్ కంటే ముందు హర్యానాలో తాము ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ ప్రకటించారు. కానీ ఆయన ఆశలు అడియాసలు అయ్యాయి. హర్యానా లో అధికారంలోకి రావాలని భావించిన ఆయన.. ఇటీవల తన ముఖ్యమంత్రి పదవికి కూడా రాజీనామా చేశారు. ఎన్నికల ప్రచారం విస్తృతంగా చేశారు. ఆయనప్పటికీ ఉపయోగం లేకుండా పోయింది. హర్యానాకు పొరుగున ఉన్న పంజాబ్ రాష్ట్రంలో ఆప్ అధికారంలో ఉంది. కానీ అదే మ్యాజిక్ ను హర్యానాలో కంటిన్యూ చేయలేకపోయింది. ఆమ్ ఆద్మీ పార్టీకి సంబంధించిన అభ్యర్థులు ఒక్క స్థానంలో కూడా ముందంజలో లేరంటే అక్కడ పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. అయితే హర్యానాలో అరవింద్ కేజ్రీవాల్ నేతృత్వంలోని ఆప్ పార్టీ ఓటమికి అనేక కారణాలను రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. సీట్ల పంపకానికి సంబంధించి కాంగ్రెస్ పార్టీతో ఏకాభిప్రాయం కుదరకపోవడం ఆప్ కు మైనస్ పాయింట్ గా పరిణమించింది. ఇది బిజెపికి లబ్ధి పొందడానికి కారణమైంది. ఫలితంగా ప్రభుత్వ వ్యతిరేక ఓట్లు మొత్తం చీలిపోయాయి. ఆప్ మొదట కాంగ్రెస్ పార్టీని 10 సీట్లు అడిగింది. దానికి కాంగ్రెస్ ఒప్పుకోలేదు. పైగా ఐదు సీట్లు మాత్రమే ఇస్తానని స్పష్టం చేసింది. చివరికి మూడు సీట్లు ఇస్తామని పేర్కొనడంతో.. దానికి ఆప్ ఒప్పుకోలేదు.హర్యానా ఎన్నికల్లో ఆప్ సహకారాన్ని కాంగ్రెస్ నేత భూపేందర్ సింగ్ హుడా మొదటి నుంచి వ్యతిరేకించారు. ఆప్ సాయం వల్ల కాంగ్రెస్ పార్టీ నష్టపోతుందని ఆయన పలు సభల్లో వ్యాఖ్యానించారు. ఇది సహజంగానే కాంగ్రెస్ పార్టీ ? ఆప్ మైత్రిని చెడగొట్టింది . ఎన్నికల ప్రచారంలో ఆప్ నేతలు తగిన స్థాయిలో ఉత్సాహాన్ని ప్రదర్శించలేదు. గత ఎన్నికల్లోనూ ఆప్ నేతలు ఇలానే పనిచేశారు. అప్పుడు కూడా ఓటమే ఎదురైంది. తీరా ఇప్పుడు ఓట్ల శాతం కూడా తగ్గిపోయింది. ఇక హర్యానా రాష్ట్రంలో బిజెపికి అనుకూల పవనాలు వీచాయి. భారతీయ జనతా పార్టీకి కంచుకోటగా ఉన్న స్థానాలను ఆప్ కు కాంగ్రెస్ పార్టీ ఆఫర్ చేసింది. అయితే అక్కడ పోటీని ఎదుర్కోవడంలో ఆప్ పూర్తిగా విఫలమైంది. మరోవైపు హర్యానాలోని కిందిస్థాయి కార్యకర్తల నుంచి ఆప్ కు ఊహించని స్థాయిలో మద్దతు లభించలేదు. స్థానిక నాయకత్వం పట్టించుకోకపోవడంతో ఆప్ విజయాలు సాధించలేకపోయింది. ఇక ఈ ఎన్నికల్లో పలు పార్టీలు విడివిడిగా పోటీ చేశాయి. దీంతో ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలిపోయింది. అందువల్ల ఆప్ విజయ అవకాశాలు పూర్తిగా తగ్గిపోయాయి. పైగా ఆప్ నేతలు అనేక వివాదాలలో కూరుకుపోయారు. దానివల్ల ఆ పార్టీ ప్రతిష్ట దారుణంగా దెబ్బతిన్నది. హర్యానా ప్రజల మనసులను గెలుచుకోవడంలో ఆప్ దారుణంగా విఫలమైంది. హర్యాన రాష్ట్రంలో తన బలాన్ని అంచనా వేయడంలో ఆప్ తప్పటడుగులేసింది. అది అంతిమంగా పార్టీ వైఫల్యానికి దారితీసింది. ఎన్నికల్లో పోటీ చేయడానికి కొంతమంది నాయకులు ముందుకు రాలేదు. పోటీలో ఉన్న నాయకులు సరిగ్గా ప్రచారం చేయలేదు. పైగా కాంగ్రెస్ పార్టీతో పొత్తు చివరి వరకు కుదరకపోవడం.. అప్పటికప్పుడు అభ్యర్థులను ఎంపిక చేయడం ఆప్ ఓటమికి దారి తీశాయి.

# డేగ కాళ్లకు నిఘా నేత్రాలు...

టెక్నాలజీతో ఎన్ కౌంటర్లు...

రాయ్ పూర్: ఎన్ కౌంటర్ గురించి టాపిక్ వినిపిస్తే చాలు ప్రజల్లో హై అటెన్షన్ వస్తుంది. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఫుల్ అటెన్షన్ ను పోగేసుకున్న ఎన్ కౌంటర్ ఏదంటే అందరికీ ముందుగా గుర్తు వచ్చేది దిశ ఎన్ కౌంటర్. సీపీ సజ్జనార్ ఉన్న సమయంలో ఈ భారీ ఎన్ కౌంటర్ జరిగిన విషయం తెలిసిందే. ఈ ఎన్ కౌంటర్ తో ప్రజల్లో కాస్త భయం వచ్చినా అది కొన్ని రోజులే అని అర్థం అయింది. అత్యాచార కేసులు మాత్రం ఎక్కడ కూడా తగ్గలేదనేది కాదనలేని వాస్తవం. అయితే ప్రస్తుతం మరో డిఫరెంట్ కోణానికి సంబంధించిన ఎన్ కౌంటర్ గురించి తెలుసుకుందాం.మూవోయిస్టు ముక్త్ భారత్ సంకల్పంగా బస్తర్‌లో ఎన్‌కౌంటర్ల పర్వం సాగుతున్న విషయం తెలిసిందే. ఛత్తీస్‌గఢ్ అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్ దేశంలోనే రెండో పెద్ద ఎన్‌కౌంటర్ గా చెబుతున్నారు. అబూజ్‌మఢ్ అడవుల్లో దంతెవాడ, నారాయణపూర్ జిల్లాల సరిహద్దులో మావోయిస్టుల క్యాంప్‌పై ఆఖీఉ బలగాలు విరుచుకుపడ్డారు. ఈ భారీ ఎన్‌కౌంటర్ జరగడంతో 31మంది మావోయిస్టులు మరణించారు. గత 8 నెలల్లో 188 మంది మావోయిస్టులు ఎన్‌కౌంటర్లలో ప్రాణాలు కోల్పోయారు. అయితే మావోయిస్టులకు గట్టి పట్టున్న దండకారణ్యంలో ఈ ఆపరేషన్ కగార్‌కు దారి చూపిందెవరు అనే ప్రశ్న చాలా మందిలో మెదులుతుంది. మావోయిస్టు స్థావరాలను పోలీస్ బలగాలు ఎలా పసిగట్టాయనేది బిగ్ క్వశ్చన్. కూంబింగ్ ఆపరేషన్లు దండకారణ్యంలో మాములుగా జరుగుతుంటాయి. కానీ ఇప్పట్లా ఈ స్థాయి భారీ ఎన్‌కౌంటర్‌కు మాదిరి ఎప్పుడు జరగలేదు. మరి ఈ సారి జరిగిన ఎన్ కౌంటర్ కు ఎలా సాధ్యమైంది?.. పోలీసు బలగాలు కళ్లతో కాదు డేగ కాళ్లతో దండకారణ్యాన్ని ఎలా జల్లెడపట్టగలిగాయి? డేగ కాళ్లే ఆపరేషన్ కగార్‌కు నిఘా కళ్లయ్యాయా? అని ఆశ్చర్యపోతున్నారు ప్రజలు. ఇటీవల కాలంలో ఎన్నడూ లేని విధంగా జరిగిన ఇంత పెద్ద ఎన్‌కౌంటర్‌కు దారి చూపింది రాటుదేలిన గరుడ పక్షులా? అంటున్నారు కొందరు. అయితే కగార్ కా పీఛే ఈగల్ స్క్వాడ్ సీక్రెట్ మిషన్ ఉంద అనే అనుమానా? కూడా వస్తున్నాయట.పాత రోజుల్లో పావురాలతో రాయబేరం పంపేవాళ్లు అనే విషయం తెలిసిందే. ఆ కాన్సెప్ట్‌కు పోలీసులు మరింత పదను పెట్టి గరుడ టీమ్స్‌ను రంగంలోకి దింపారట. నెదర్లాండ్స్ సహా పలు దేశాల్లో మిలటరీ, నిఘా ఆపరేషన్స్‌లో ఈగల్ స్క్వాడ్ ను వాడుతుంటారు. అసాంఘిక శక్తుల కార్యకలాపాలను పసిగట్టడంలో ఈగల్ స్క్వాడ్ ఎన్నో సత్ఫలితాలను ఇచ్చిన దాఖలాలు కూడా ఉన్నాయి. డ్రోన్లతో గాలిస్తే యాంటి సోషల్ ఎలిమెంట్స్ అప్రమత్తమయ్యే చాన్స్ ఉంటుంది. అదే గరుడ కాళ్లకు హిడెన్ కెమెరాలను అమర్చి ఎగరేస్తే.. ఇక తిరుగు ఏం ఉంటుంది? విజిలేసినంత ఈజీగా దట్టమైన అడవిలో కూడా ఎక్కడ ఏం జరుగుతుందో తెలుసుకోవడం చాలా సులభం అవుతుంది కదా. అలా ఆపరేషన్ కగార్‌కు ఇన్‌ఫార్మర్ నెట్‌వర్క్ కారణమనేది ఒక వాదన. కానీ ఈ ఈగల్ స్క్వాడ్ ఎత్తుగడను కూడా ఉపయోగించారు అనే టాక్ కూడా ఉంది.అయితే సైనిక స్థావరాలపైన ఎవరైనా డ్రోన్‌లు ఎగరేస్తే వాటిని పసిగట్టి ధ్వంసం చేసేలా తర్ఫీదునిచ్చి ఈగల్ స్క్వాడ్‌ను రంగంలోకి దింపుతున్నారట. చాలా దేశాల్లో ఈగల్ స్క్వాడ్‌ను బలోపేతం చేస్తున్న విషయం తెలిసిందే. ఇటీవల తెలంగాణలో కూడా ఈగల్ స్క్వాడ్‌ను ఏర్పాటు చేశారు అధికారులు. నిజామాబాద్, మొయినా బాద్‌లో శిక్షణ ఇచ్చారు కూడా. హోంశాఖ సూచనల మేరకు దండకారణ్యంలో చేపట్టిన ఆపరేషన్ కగార్‌లో తెలంగాణ ఈగల్ స్క్వాడ్ సేవలను వినియోగించుకున్నారట. గరుడ పక్షి కాళ్లకు అమర్చిన హిడెన్ కెమెరాలు,జీపీఎస్ ట్రాకర్ సాయంతోనే పోలీస్ బలగాలు మావోయిస్టుల స్థావరాలను గుర్తించారని టాక్. మావోయిస్ట్ ముక్ భారత్ సంకల్పంగా కేంద్రం గ్రే హౌండ్స్ తరహాలో .సీఆర్పీఎఫ్ దళాల నుంచి మెరికల్లాంటి జవాన్లను ఎంపిక చేసి కోబ్రా బెటాలియన్లను రూపొందించారట. చత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఒడిశా, జార్ఖండ్, బెంగాల్ మావోయిస్టుల ప్రభావిత ప్రాంతాల్లో జల్లెడ పడుతోన్న కోబ్రా దళాలకు , తెలంగాణ ఈగల్ టీమ్ దిక్సూచిగా మారిందనే సమాచారం కూడా ఉంది.

# ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం..

డిచ్ పల్లి: స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 22 శిక్షణ లు ప్రారంభం కానున్నాయని అర్హులైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సంస్థ డైరెక్టర్ సుంకం శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మహిళలకు అందజేసే శిక్షణలు బ్యూటీ పార్లర్ (30 రోజులు),మగ్గం వర్క్ శిక్షణా(30 రోజులు), టైలర్ శిక్షణా (30 రోజులు) ఉంటుందని డైరెక్టర్ సుంకం శ్రీనివాస్ వివరించారు.

ఆసక్తి గల 19 నుండి 45 ఏళ్ల వయస్సు ఉండి నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల గ్రామీణ ప్రాంత యువతులు అర్హులన్నారు. శిక్షణ కు వచ్చే వారు తమ వెంట ధృవీకరణ పత్రాలు ఆధార్ కార్డు , రేషన్ కార్డ్ , పదోతరగతి మెమో, ఐదు ఫోటోలు తీసుకొని వచ్చి దరఖాస్తు చేసుకోవాలని సంస్థ డైరెక్టర్ సుంకం శ్రీనివాస్ తెలిపారు. శిక్షణా సమయం లో భోజనం, హాస్టల్ వసతి, శిక్షణా పూర్తిగా ఉచితంగా అందచేస్తమని, శిక్షణా అనంతరం ధృవీకరణ పత్రం, టూల్ కిట్ అందచేయడం జరుగుతుందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చిరునామా టి టి డి సి క్యాంపస్, వెలుగు ఆఫీస్ పక్కన డిచ్ పల్లి ఘన్ పుర్ మరిన్ని వివరాలకు ఫోన్ నెంబర్. 08461-295428.

# అమ్మకానికి వన్య ప్రాణులు

వరంగల్: తెలంగాణలోని ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాల్లో అడవులు ఎక్కువ. ఈ అడవుల్లో అంతరించిపోతున్న జాతులకు చెందిన జంతువులు ఉన్నాయి. వాటిని వేటాడి.. కొందరు సొమ్ము చేసుకుంటున్నారు. ఈ దందాలో రాజకీయ నాయకులు ఉండటం గమనార్హం.తెలంగాణలోని గోదావరి తీరం వెంట దట్టమైన అడవి ఉంది. ఆ ఆకుపచ్చని అడవులు జంతువుల ఆవాసానికి అనుకూలంగా ఉంటాయి. కానీ.. ఇటీవల వేటగాళ్లతో అడవి జంతువులకు ముప్పు తప్పట్లేదు. గుట్టుగా వాటిని వేటాడి గోళ్లు, మాంసం, చర్మంతో వ్యాపారం చేస్తున్నారు. ప్రభుత్వం ఎన్ని చర్యలు తీసుకున్నా.. వేట ఆగడం లేదు.వరంగల్ జిల్లాలో ఇటీవల వెలుగులోకి వచ్చిన విషయం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. అడవుల్లో ఉండే అరుదైన జంతువులను.. ఏకంగా ఆన్‌లైన్‌లో అమ్మకానికి పెట్టారు. తాజాగా.. అలుగు (పాంగోలిన్)ను అమ్మేందుకు రెడీ అయ్యారు. కానీ.. వారికి చెక్ పెట్టారు. వైల్డ్ లైఫ్ క్రైమ్ కంట్రోల్ బోర్డు సభ్యులుపులి, చిరుతపులి, అలుగు, నక్షత్ర తాబేలు, రెండు తలల పాము, ఏనుగు దంతాలకు భారీగా డిమాండ్ ఉంటుంది. దీంతో ఈ జంతువులను వేటాడేందుకు ముఠాలు తిరుగుతున్నాయి. ఆ ముఠాకు ప్రత్యేకంగా ఓ వాట్సాప్ గ్రూప్ ఉంది. ఆ గ్రూపులో వారికి చిక్కిన అరుదైన జంతువు వివరాలను పోస్టు చేస్తారు. ఎంత ధరకు అమ్ముతారో చెబుతారు. కావాల్సిన వారు.. ముఠా దగ్గరకు వచ్చి.. డబ్బులు ఇచ్చి తీసుకెళ్తుంటారు.తాజాగా.. వరంగల్ జిల్లాకు చెందిన ఓ ముఠాకు.. అలుగు చిక్కింది. దాన్ని ఒకరు రూ.30 వేలకు కొన్నారు. అలుగు పొలుసులకు డిమాండ్ ఉండటంతో.. అది కాస్త చేతులు మారి రూ.3 లక్షల ధర పలికింది. ఈ విషయం చెన్నై కేంద్రంగా నడిచే వైల్డ్ లైఫ్ క్రైమ్ కంట్రోల్ బోర్డు గుర్తించింది. ఆ వాట్సాప్ గ్రూప్‌లో బ్యూరో సభ్యులు కొనుగోలుదారులుగా సంప్రదింపులు చేశారు. ఇద్దరు సభ్యులు ఆ నెంబర్ల ఆధారంగా చాట్ చేసుకుంటూ వరంగల్ వచ్చారు. భూపాలపల్లి, కాటారం ప్రాంతాలకు వెళ్లారు. అలుగును, ముగ్గురు నిందితులను పట్టుకున్నారు.పాంగోలిన్ అమ్మకానికి సంబంధించి.. ముగ్గురిని పట్టుకున్నారు. దీని వెనుక 8 మంది ఉన్నట్టు అనుమానిస్తున్నారు. భూపాలపల్లి, కాటారం, మహాముత్తారం మండలాలకు చెందిన వారు ఉన్నారని తెలుస్తోంది. వీరిలో ఓ రాజకీయ పార్టీ నేత కూడా ఉన్నారని సమాచారం.అలుగు వంటి అరుదైన వన్యప్రాణుల అమ్మకాలకు పెద్ద నెట్‌వర్క్ ఉన్నట్లు తెలుస్తోంది. పురాతన వస్తువుల పేరిట దేశవ్యాప్త నెట్‌వర్క్‌తో ఓ వాట్సాప్ గ్రూపు నడుపుతున్నారు. ఇందులో భూపాలపల్లి జిల్లాకు చెందిన కొందరు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. వారే అలుగు ఫొటోలను అప్‌లోడ్ చేసి అమ్మకానికి పెట్టినట్టు సమాచారం.

# ఆదాయంలో నాలుగో స్థానంలో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్

హైదరాబాద్: భారతీయ రైల్వే దేశంలోనే అతి పెద్ద రవాణా వ్యవస్థ. ప్రతిరోజూ కోట్లాది మందిని తమ గమ్యస్థానాలకు సురక్షితంగా చేరుస్తుంది. ప్రపంచంలోనే ఇండియన్ రైల్వేస్‌ది ప్రత్యేక స్థానం. ప్రతి ఏడాదిలానే ఈ ఏడాది సైతం రైల్వే స్టేషన్ల ఆదాయాన్ని రైల్వే శాఖ వెల్లడించింది. 2023 - 24 ఆర్థిక ఏడాదికి సంబంధించి ఎక్కువ ఆదాయం పొందిన 100 రైల్వే స్టేషన్లలో న్యూఢిల్లీ రైల్వే స్టేషన్ అగ్రస్థానంలో ఉంది. పశ్చిమబెంగాల్‌లోని హౌరా స్టేషన్ రెండో స్థానం, చెన్నైలోని ఎంజీఆర్ సెంట్రల్ మూడో స్థానం, తెలంగాణలోని సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నాలుగో స్థానంలో ఉన్నట్లు ప్రకటించింది. భారతీయ రైల్వేకు ఏటా ఢిల్లీ రైల్వే స్టేషన్ నుంచి రూ.3,337 కోట్ల ఆదాయం వస్తుండగా టాప్‌లో నిలిచింది.

హౌరా రైల్వే స్టేషన్‌కు రూ.1,692 కోట్ల వార్షిక ఆదాయం రాగా.. చెన్నై సెంట్రల్‌కు రూ.1,299 కోట్లు వచ్చాయి. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ రూ.1,276 కోట్లు అర్జించింది. అలాగే, రూ.500 కోట్ల కంటే ఎక్కువ ఆదాయం వస్తున్న రైల్వే స్టేషన్లు నాన్ సబర్బన్ గ్రూప్ 1 కేటగిరీ కింద చేర్చారు. ఈ జాబితాలో మొత్తం 28 స్టేషన్లు స్థానం దక్కించుకున్నాయి.అటు, ప్రయాణికుల సంఖ్యా పరంగా చూస్తే ముంబైలోని థానే రైల్వే స్టేషన్ టాప్ ప్లేస్‌లో నిలిచింది. 2023 - 24 ఆర్థిక సంవత్సరంలో 93.06 కోట్ల మంది ప్రయాణికులు ఈ స్టేషన్ గుండా ప్రయాణించారు. ముంబైలోని కల్యాణ్ రైల్వే స్టేషన్ రెండో స్థానంలో నిలిచింది. ఏటా ఇక్కడి నుంచి 83.79 కోట్ల మంది ప్రయాణిస్తున్నారు. అలాగే, న్యూఢిల్లీ రైల్వే స్టేషన్ నుంచి 39.36 కోట్ల మంది ప్రయాణిస్తున్నారు. అలాగే, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ సైతం ఈ జాబితాలో చోటు దక్కించుకుంది. దక్షిణ మధ్య రైల్వేలో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ తర్వాత ఎన్ఎస్‌జీ 1 హోదా విజయవాడ మాత్రమే సాధించింది. ఈ గుర్తింపుతో కేంద్ర ప్రభుత్వం ఈ స్టేషన్లకు మరిన్ని నిధులు కేటాయించనుంది. ప్రయాణికులకు సైతం ఆధునిక సౌకర్యాలు కల్పించనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. ప్రయాణికులకు మరింత సౌకర్యవంతమైన ప్రయాణమే లక్ష్యంగా చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు.

ఆదాయం పూర్తి వివరాలు

న్యూఢిల్లీ - రూ.3,337 కోట్లు
హౌరా (వెస్ట్ బెంగాల్) - రూ.1,692 కోట్లు
చెన్నై సెంట్రల్ (తమిళనాడు) - రూ.1,299 కోట్లు
సికింద్రాబాద్ (తెలంగాణ) - రూ.1,276 కోట్లు
హజరత్ నిజాముద్దీన్ (ఢిల్లీ) - రూ.1,227 కోట్లు
లోకమాన్య తిలక్ టెర్మినల్ (ముంబై) - రూ.1,036 కోట్లు
అహ్మదాబాద్ (గుజరాత్) - రూ.1,010 కోట్లు
ముంబై సీఎస్‌టీ (మహారాష్ట్ర) - రూ.982 కోట్లు

ప్రయాణికుల సంఖ్యాపరంగా చూస్తే..

న్యూఢిల్లీ - 39,362,272
హౌరా (వెస్ట్ బెంగాల్) - 61,329,319
చెన్నై సెంట్రల్ (తమిళనాడు) - 30,599,837
సికింద్రాబాద్ (తెలంగాణ) - 27,776,937
హజరత్ నిజాముద్దీన్ (ఢిల్లీ) - 14,537,686
లోకమాన్య తిలక్ టెర్మినల్ (ముంబై) - 14,680,379
అహ్మదాబాద్ (గుజరాత్) - 18,260,021
ముంబై సీఎస్‌టీ (మహారాష్ట్ర) - 51,652,230

# టీడీపీ పూర్వ వైభవం సాధ్యమేనా?

హైదరాబాద్: అదొక సుధీర్ఘ రాజకీయ చరిత్ర గల పార్టీ. ఆ పార్టీ ఏర్పాటు చేసింది తెలుగు ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయుడు. ఉమ్మడి ఆంధ్ర రాష్ట్రం ఉన్న సమయంలో ఆ పార్టీకి ఎదురు లేదు.. తిరుగు లేదు. కానీ విభజన అనంతరం ఏపీలో ఆ పార్టీ ప్లేస్ పదిలంగానే ఉంది. ప్రస్తుతం అధికారంలో కూడా ఉంది. ఆ పార్టీ ఏదో కాదు టీడీపీనేగత ఎన్నికల్లో కూటమి జనసేన, బీజేపీతో కలిసిన టీడీపీ ఎన్నడూ లేనంతగా ప్రజాదరణతో గెలిచి, ప్రపంచాన్ని ఏపీ వైపు చూసేలా చేసింది. ఏపీలో బలంగా ఉన్న ఈ పార్టీ.. తెలంగాణలో అంత ప్రభావం చూపలేని పరిస్థితి. ఇప్పుడు మళ్ళీ తన పాగా వేయాలని టీడీపీ అధినేత , సీఎం చంద్రబాబు అడుగులు వేస్తున్నారన్నది పొలిటికల్ టాక్.ఏపీలో ప్రస్తుతం అధికారంలో ఉన్న పార్టీగా టీడీపీని చెప్పవచ్చు. కూటమిగా ఏర్పడి విజయాన్ని అందుకున్నా.. టీడీపీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఏపీలో పట్టు ఉంది కానీ..

తెలంగాణలో పార్టీ ఉనికి అంతగా లేదన్నది టీడీపీ నేతల అభిప్రాయం. తెలుగు రాష్ట్రాల విభజన సమయంలో ఏపీ వైపుకు మళ్లిన టీడీపీ, చిన్నగా తెలంగాణలో కూడా తన పార్టీ పూర్వ వైభవాన్ని తీసుకువచ్చేందుకు పెద్ద ప్లాన్ వేసినట్లు పొలిటికల్ ఎనలిస్టుల విశ్లేషణ. ఉమ్మడి రాష్ట్రం సమయంలో టీడీపీకి తెలంగాణలో కూడా పట్టు ఉండేది. తెలంగాణ వాదం రావడం, ఇప్పటి బీఆర్ఎస్ అప్పుడు టీఆర్ఎస్ తెలంగాణ వాదాన్ని గట్టిగా వినిపించడం, కేంద్రంలో అధికారంలో గల కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్రాన్ని ఇవ్వడం చకచకా సాగాయి. ఆ తరుణంలో నాటి టీఆర్ఎస్ పార్టీ రాష్ట్రంలో పగ్గాలు చేపట్టింది. ఇక ఉమ్మడి రాష్ట్ర సీఎంగా గల చంద్రబాబు తన మకాం ఏపీకి మార్చేశారు.ఇటువంటి పరిస్థితుల్లో టీడీపీ నుండి టీఆర్ఎస్ లోకి వలసలు సాగాయి. ఇక టీడీపీ పుంజుకోలేని పరిస్థితి ఏర్పడింది. ఈ క్రమంలో ప్రస్తుతం ఏపీలో అధికార పగ్గాలు తన చేతిలో గల చంద్రబాబు.. తెలంగాణలో టీడీపీ పూర్వ వైభవాన్ని కోరుకుంటున్నారని ఇటీవల కలిసిన మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి తెలిపారు. అంతేకాదు తాను టీడీపీలో చేరుతున్నట్లు ప్రకటించారుఇదే ఇప్పుడు తెలంగాణ పొలిటికల్ హాట్ టాపిక్. టీడీపీ తెలంగాణలో పుంజుకోవాలంటే.. ఏదో ఒక పార్టీ నుండి నాయకుల వలసలు సాగాల్సిందే. అయితే గతంలో టీడీపీ నుండి ఎక్కువగా వలసలు సాగింది ఇప్పటి బీఆర్ఎస్ లోకి. ఇప్పుడు టీడీపీలోకి వెళుతున్నట్లు ప్రకటించిన తీగల కూడా బీఆర్ఎస్ పార్టీ నుండి వస్తున్న వారే.అందుకే టీడీపీలోకి ఎక్కువగా బీఆర్ఎస్ నేతల వలసల పర్వం సాగుతుందని రాజకీయ చర్చలు ఊపందుకున్నాయి. ఏదిఏమైనా టీడీపీ తెలంగాణ పట్టు కోసం ప్రయత్నిస్తే.. ఏ పార్టీ నుండి వలసలు సాగుతాయో.. అసలు టీడీపీ పూర్వ వైభవం ఇప్పుడున్న పరిస్థితుల్లో సాధ్యమేనా అన్న ప్రశ్నలు కూడా వినిపిస్తున్నాయి. మరి ఏమి జరుగుతుందో వెయిట్ అండ్ సీ !

# పదేళ్లలో 226 చెరువులు కబ్జా....

హైదరాబాద్: ఛెరువులు, నాలాలపై ఉన్న నిర్మాణాలపై పూర్తి రిపోర్టును సీఎం రేవంత్ రెడ్డికి అందజేశారు అధికారులు. 2014 తర్వాత ఓఆర్ఆర్ లోపల ఉన్న ప్రతి చెరువుపైన రిపోర్టులో పూర్తి వివరాలను అధికారులు ప్రభుత్వానికి తెలియజేశారు. హైదరాబాద్ 920 చెరువులు ఉంటే అందులో 225 చెరువులు పూర్తి స్థాయిలో ఆక్రమణకు గురైనట్లు అధికారులు గుర్తించారు. 195 చెరువులు పాక్షికంగా ఆక్రమణకు గురైనట్లు అధికారులు తెలిపారు. గత పదేళ్ల కాలంలో 20 చెరువులు పూర్తిగా కబ్జా అయ్యాయని, 24 చెరువుల్లో పాక్షికంగా, 127 చెరువుల్లో పెద్ద మొత్తంలో ఆక్రమణలు జరిగాయని వెల్లడైంది. తెలంగాణ రిమోట్ సెన్సింగ్ అప్లికేషన్ ద్వారా రేవంత్ సర్కార్ ఈ సర్వే నిర్వహించింది. హైదరాబాద్ నగరంలో చెరువులపై అధికారులు ఫోకస్ చేశారు. ప్రధానంగా హైడ్రా ఏర్పాటు చేశాక ప్రభుత్వంపై ప్రతిపక్షాలు అనేక విమర్శలు చేశాయి. దాంతో ఒక ప్లాన్ ప్రకారం ముందుకెళ్లాలని అధికారులు నిర్ణయించారు. ఇందులో భాగంగా హైదరాబాద్ నగరంలో ఉండే చెరువుల లెక్కలు తీశారు. 2014 వరకు అంటే రాష్ట్రం ఏర్పడే వరకు హైదరాబాద్ నగరంలో చెరువులు పరిస్థితి ఏంటి? అనే అంశాలతో పాటు గడిచిన పదేళ్లలో చెరువులు ఏ విధంగా కబ్జా అయ్యాయి అనేటటువంటి అంశాలపైన ఫోకస్ పెట్టారు.హైదరాబాద్ నగరంలో మొత్తం 920 చెరువులు ఉండగా.. రాష్ట్రం ఏర్పడే నాటికి 225 చెరువులు పూర్తి స్థాయిలో కబ్జాకు గురై, ఆ చెరువులు కనుమరుగు అయిపోయాయి అన్నట్లుగా అధికారులు లెక్కలు తేల్చారు. ఆ తర్వాత మరొక 44 చెరువులు గడిచిన తొమ్మిది పదేళ్లలో కబ్జాకు గురైనట్లుగా లెక్కలు వేశారు. ఇప్పుడు మొత్తంగా 269 చెరువులు పూర్తి స్థాయిలో కనుమరుగు కాగా, 127 చెరువులు పాక్షికంగా కనుమరుగు కావడం జరిగింది. ఇక, 524 చెరువులకు సంబంధించి ఎలాంటి కబ్జాలు లేనట్లుగా గుర్తించారు. ప్రధానంగా వీటన్నింటపై ఫోకస్ చేసిన అధికారులు చాలా వేగంగా వీటన్నింటిని అభివృద్ధి చేయాలి, అదే విధంగా ఉండేటటువంటి కబ్జాలు తొలగించాలని నిర్ణయించారు. అయితే, వీటన్నింటికి ఒక అడ్డండి ఏర్పడుతుంది.పూర్తి స్థాయిలో చెరువులకు బౌండరీలు ఫిక్స్ చేశాకే ముందు కెళ్లాలని నిర్ణయించారు. అందుకు అనుగుణంగా లేక్ ప్రొటెక్షన్ కమిటీ సమావేశాలు రెగులర్‌గా జరుగుతున్నాయి. గడిచిన 15 రోజుల్లో రెండవ కమిటీ సమావేశం జరిగింది. 2017-18 తర్వాత లేక్ ప్రొటెక్షన్ కమిటీ ఇటీవలి కాలంలో రెండుసార్లు సమావేశం కావడం జరిగింది.ఇందులో ముఖ్యంగా ఎఫ్ టీఎల్, బఫర్ జోన్లు గుర్తించేందుకు ఇరిగేషన్, రెవెన్యూ శాఖతో పాటు నేషనల్ రిమోట్ సెన్సింగ్ ఏజెన్సీ, స్టేట్ రిమోట్ సెన్సింగ్ అప్లికేషన్ సెంటర్ ద్వారా సర్వే ఆఫ్ ఇండియా అధికారులతో కలిసి ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసిన హైడ్రా కమిషనర్ రంగనాథ్.. పూర్తి స్థాయిలో దీనికి సంబంధించిన డేటాను సేకరించాలని నిర్ణయించారు.

# మళ్లీ హర్యానా పగ్గాలు సైనీకే...

ఛండీఘడ్: లోక్‌సభ ఎన్నికలకు ముందు హర్యానా ముఖ్యమంత్రిగా నయాబ్ సింగ్ సైనీని నియమించినప్పుడు, రాకీయ నిపుణులందరూ ఈ ప్రయోగం విఫలమైనట్లు ప్రకటించారు. గుజరాత్‌లోని పలు రాష్ట్రాల్లో ఎన్నికలకు ముందు సీఎంను మార్చడం ద్వారా అధికార వ్యతిరేక ప్రభావాన్ని తగ్గించే ట్రిక్కు బీజేపీ ప్రయత్నించింది. హర్యానా స్వభావం గుజరాత్‌కు భిన్నంగా ఉంటుందని, అందుకే నైబ్ సింగ్ సైనీ ఆరు నెలల పాటు ఇక్కడ సీఎంగా ఉంటారని రాజకీయ పండితులు విశ్వసించారు. పోలింగ్ తర్వాత, ఒపీనియన్ పోల్ కూడా ఈ ఊహాగానాన్ని ధృవీకరించింది. ఇందులో కాంగ్రెస్‌కు 55-60 సీట్లు వస్తాయని అంచనా వేశారు. ఈ ఊహాగానాలన్నింటికీ అక్టోబరు 8న ఫలితాలు తెరదించాయి. 2019లో కంటే ఎక్కువ స్థానాల్లో బీజేపీ గెలుపొందింది. ఈ ఫలితంతో నాయబ్ సింగ్ సైనీ భవితవ్యం తేలిపోయింది. 2024 హర్యానా అసెంబ్లీ ఎన్నికలకు ముందు, నైబ్ సింగ్ సైనీ, ముఖ్యమంత్రిగా ఉన్నప్పటికీ, అండర్ డాక్‌గా కనిపించారు. ఆయన ఇమేజ్ మాజీ ముఖ్యమంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌కు దగ్గరగా ఉంది. హర్యానా అసెంబ్లీ ఎన్నికలు ప్రకటించినప్పుడు, రాజకీయ పండితులు సహా చాలా మంది విశ్లేషకులు హర్యానా నుండి బీజేపీ నిష్క్రమణ ఖాయంగా భావించారు. అధికార వ్యతిరేకత, మల్లయోధులు, రైతులు, సైనికుల సమస్యలపై కాంగ్రెస్ దూకుడుగా ప్రచారం నిర్వహించింది. రాహుల్ గాంధీతో పాటు ప్రియాంక గాంధీ, భూపేంద్ర హుడా, దీపేంద్ర హుడా హర్యానాలో నయాబ్ సింగ్ సైనీ ప్రభుత్వాన్ని దుయ్యబట్టారు. పోలింగ్ తర్వాత, ఎగ్జిట్ పోల్‌లో బీజేపీకి 25-28 సీట్లు మాత్రమే ఇచ్చారు. దీని తర్వాత కూడా సైనీ తన నమ్మకాన్ని నిలబెట్టుకున్నాడు. ఎన్నికల్లో బీజేపీకి పూర్తి మెజారిటీ వచ్చింది. ఈ విజయం నాయబ్ సింగ్ ఇమేజ్‌ని మార్చేయడం ఖాయంగా కనిపిస్తోంది. హర్యానాలో కూడా బీజేపీ గుజరాత్ మంత్రాన్నే పాటించింది. హర్యానా నుంచి మనోహర్ లాల్ ఖట్టర్‌ను కేంద్రానికి తీసుకెళ్లారు. నాయబ్ సింగ్ సైనీని ఓబీసీ అభ్యర్థిగా సీఎం చేశారు. సీఎం అయిన వెంటనే సైనీ ప్రజాకర్షక పథకాలకు ఖజానాను తెరిచారు. హర్యానాలో కూడా 16 మంది ఎమ్మెల్యేల టిక్కెట్లు నిరాకరించింది అధిష్టానం. ఇప్పుడు ఫలితం వెలువడింది. హర్యానా సిట్టింగ్ ముఖ్యమంత్రి నయాబ్ సింగ్ సైనీకి మరోసారి అత్యున్నత పదవి దక్కే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయంటున్నారు రాజకీయ విశ్లేషకులు. ఆయన సమర్థతవంతమైన రాజనీతి కారణంగా ఊహాగానాలకు ముగింపు పలికారని బీజేపీ నాయకులు అంటున్నారు. రాష్ట్రంలో 90 అసెంబ్లీ స్థానాలకు గాను 49 స్థానాల్లో బీజేపీ విజయం సాధించి, చారిత్రాత్మకంగా మూడోసారి అధికారంలోకి వచ్చింది. కాంగ్రెస్ 36 స్థానాలకే పరిమితమైంది. సైనీ విజయం సాధిస్తే, మరోసారి ముఖ్యమంత్రిగా కొనసాగుతారని ఎన్నికలకు ముందే బీజేపీ నాయకత్వం స్పష్టం చేసినప్పటికీ, అతని పనితీరు, కుల కోణం దృష్ట్యా మార్పుపై ఊహాగానాలు వచ్చాయి. సైనీ ఇతర వెనుకబడిన తరగతులకు చెందిన వ్యక్తి కావడం, అదే సమయంలో రాష్ట్రంలో జాట్‌లు అత్యున్నత పదవి నుండి నాయకత్వం వహిస్తుండటం సీఎం మార్పు ఉండవచ్చని భావించారు. ఎన్నికలకు దాదాపు 200 రోజుల ముందు సైనీని ముఖ్యమంత్రి పదవికి ఎంపిక చేశారు. అందులో భాగంగానే అధికార వ్యతిరేకత ఉన్న రాష్ట్రాల్లో బీజేపీ చేపట్టే వ్యూహాత్మక ఎన్నికలకు ముందు పునర్వ్యవస్థీకరణ మంచి ఫలితాన్ని రాబట్టిందనే చెప్పవచ్చు. అంతేకాకుండా సైనీకి మాజీ సీఎం, ప్రస్తుత కేంద్ర మంత్రి ఖట్టర్ మద్దతు ఉండటంతో మార్పు సాఫీగా కనిపించిందనే చెప్పాలి. సైనీ తన అతి తక్కువ హయాంలో వ్యాపారులు, యువకులు, వెనుకబడిన తరగతులు, ప్రభుత్వ ఉద్యోగులకు ప్రయోజనం చేకూర్చేందుకు ఉద్దేశించిన అనేక పథకాలను అమలు చేయగలిగారు. ఖట్టర్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా సంవత్సరాలుగా పేరుకుపోయిన అధికార వ్యతిరేకతను తిప్పికొట్టారని బీజేపీ నాయకులు చెప్పారు. అగ్నివీర్‌లకు ఉపాధి, వ్యవస్థాపక అవకాశాలను అందించడానికి, అగ్నివీర్ పథకంపై ఎదురుదెబ్బలను ఎదుర్కోవడానికి రాష్ట్ర హర్యానా అగ్నివీర్ పాలసీ, 2024ను ప్రారంభించారు. నిరుపేద ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచిత వైద్య పరీక్షలు అందించడంతోపాటు విద్యుత్తుపై కనీస చార్జీలను రద్దు చేశారు. ఇది కూడా తన సాంప్రదాయ జాట్-యేతర ఓటర్ల స్థావరాన్ని ఏకీకృతం చేసుకునేందుకు బీజేపీ వ్యూహంలో భాగం. జాట్ ఓట్లు కాంగ్రెస్, జాట్ పార్టీలైన ఐఎన్‌ఎల్‌డి, జననాయక్ జనతా పార్టీల మధ్య చీలిపోతాయని ఊహించారు. జాట్‌ల ప్రాబల్యం ఉన్న సీట్లలో 70 శాతం ఆధిక్యంలో ఉంది. మొత్తం 33 స్థానాలో బీజేపీ 17, కాంగ్రెస్ 14 స్థానాల్లో మాత్రమే ముందంజలో ఉంది. మొత్తం ఏడు బెల్‌వెదర్ స్థానాల్లో ఆధిక్యంలో ఉంది. షెడ్యూల్డ్ కులాల ఆధిపత్యం ఉన్న సీట్లలో కూడా బీజేపీ ఆధిక్యత సాధించగలిగింది. హర్యానా ముఖ్యమంత్రిగా మరోసారి నయాబ్ సింగ్ సైనీ వైపు బీజేపీ అధిష్టానం మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. పార్టీలో మరికొందరు పోటీదారులు కనిపిస్తున్నారు. రాష్ట్ర మాజీ హోంమంత్రి అనిల్ విజ్, కేంద్ర మంత్రి రావు ఇంద్రజిత్ సింగ్ సీఎం పదవిపై అశలు పెట్టుకున్నట్లు తెలుస్తోంది.

# సబర్మతి తరహాలో మూసి ప్రక్షాళన

హైదరాబాద్: రాత్రికి రాత్రే ఏ అద్భుతమూ జరగదు. ఎవరి చేతుల్లోనూ అల్లావుద్దీన్ అద్భుత దీపం అంతకంటే లేదు. ఉన్నదల్లా సంకల్ప బలమే. ఇప్పుడు మూసీ ప్రక్షాళన విషయంలోనూ సీఎం రేవంత్ రెడ్డి అదే సంకల్పంతో ఉన్నారు. రాజకీయంగా కాస్త నష్టమైనా సరే.. కోటి మందికి పైగా ఉండే హైదరాబాదీల కోసం, నల్గొండ ప్రజల కోసం మూసీకి మహర్దశ తీసుకొస్తానంటున్నారు. అందరి ముసుగులు తొలగిస్తానంటున్నారు. సబర్మతి విషయంలో మోడీ, థేమ్స్ విషయంలో ఇంగ్లండ్ పాలకుల సంకల్పానికి నిదర్శనంగా అవిప్పుడు వరల్డ్ క్లాస్ టూరిజం స్పాట్లుగా మారాయి. పర్యావరణానికి మేలు చేస్తున్నాయి. ఒకసారి మన మూసీ నది దగ్గరికి వద్దాం. మూసీ అలాగే ఉండాలి.. ఎవరినీ ఇక్కడి నుంచి తరలించొద్దు. పేదల ఇండ్లు కూల్చొద్దు. ఇదీ ప్రధాన ప్రతిపక్షం వాదన. ఒకప్పుడు మూసీ ప్రక్షాళన జరగాల్సిందే అని మాట్లాడిన వాళ్లే ఇప్పుడు అడ్డుపడుతున్న పరిస్థితి. మూసీ కంపు ఎప్పటికీ ఇలాగే ఉండిపోవాలా అన్నది సగటు హైదరాబాదీ ప్రశ్న. నగరం నడిబొడ్డు నుంచి మూసీ ప్రవహిస్తుంది. మొత్తం దుర్వాసనే. ఎటు చూసినా కాలుష్యమే. పైగా ఆక్రమణలు. ఇలాగే నల్గొండ జిల్లాలోకి ప్రవేశిస్తే ఇదే కాలుష్య నీటిని అక్కడ తాగడానికి, పంటలు పండించడానికి వాడుతున్నారు. ఇంతకంటే ఘోరం ఉంటుందా? కోటి మందికి పైగా జనాభా ఉన్న హైదరాబాద్ నగరానికి మూసీ నది ఒక శాపంగా మారొద్దంటే ప్రక్షాళన జరగాల్సిందే అంటున్నారు. కానీ విపక్షాల రూటు మాత్రం మరోలా ఉందన్న వాదన వినిపిస్తోంది. నిజానికి ఇండ్లు కోల్పోతున్న వారికి డబుల్ బెడ్రూం ఇండ్లు కేటాయిస్తున్నారు. తరలించడానికి ఖర్చులు కూడా ఇచ్చి తీసుకెళున్నారు. కానీ ఇవేవీ కనిపించడం లేదా అన్న ప్రశ్నలున్నాయి. సరే ఉన్నఫళంగా ఖాళీ చేయాలంటే కష్టమే. వారిని సముదాయిస్తున్నారు. హైదరాబాద్ అంటే పెరల్ సిటీ. అంటే ముత్యాలనగరం అని పేరు. కానీ తొలిసారి సిటీకి ఎవరైనా వచ్చి మూసీ చూస్తే ఆ అభిప్రాయాన్ని మార్చుకుంటారు. 1591లో ఏర్పాటైన ఈ నగరం చారిత్రక ఖ్యాతి సంపాదించుకుంది. కానీ నగరీకరణ పెరగడం, మూసీ ఆక్రమణలు, దశాబ్దాల నిర్లక్ష్యంతో మూసీ పూర్వ వైభవం కోల్పోయింది. కానీ దీన్ని మార్చాలని సీఎం రేవంత్ చాలా సంకల్పం తీసుకున్నారు. ఎన్ని సమస్యలు ఎదురైనా ముందుకే అంటున్నారు. మూసీ ప్రక్షాళన వద్దు అనే వాళ్లంతా ఫాంహౌజ్ లు కట్టుకుని అడ్డుకుంటున్న వారే అంటున్నారు. ముసుగులు తొడుక్కున్న వారిని బయటకు తీసుకొస్తామంటున్నారు సీఎం. రాజకీయంగా నష్టం ఉంటుందని అంచనా వేయలేనా అని ప్రశ్నించారు. ఒక అద్భుతం జరగాలంటే చాలా జరగాలి. నిజానికి మూసీ పరివాహక ప్రజలను తరలించవద్దు అంటున్న పార్టీలు పేదలకు ఏం చేయాలో ఎందుకు చెప్పలేకపోతు న్నాయన్న ప్రశ్నలు వస్తున్నాయి. ప్రభుత్వ స్థలాలు ఎన్నో ఉన్నాయని అక్కడికి తరలిద్దామన్న ప్రతిపాదన తెచ్చారు సీఎం రేవంత్. అంతే కాదు.. కేంద్రం దగ్గరికి వెళ్లి నిధులు తీసుకొచ్చే విషయంలో ముందుకొస్తారా అని బీజేపీని ప్రశ్నించారు. ఎందుకంటే సబర్మతి కల సాకారమైనప్పుడు మూసీ ప్రక్షాళన ఎందుకు కాదు అన్నదే సీఎం చెప్పాలనుకుంటున్న పాయింట్. నిజానికి మూసీ రివర్ ఫ్రంట్ విషయంలో ఇంత సీరియస్‌గా ప్రభుత్వం ముందుకెళ్తుంటే.. ఇందులో మతలబు ఉందని, మూసీ వెనుక కథలు చాలా ఉన్నాయని, డబ్బులు నొక్కే కార్యక్రమమంటూ విపక్షాలు అంటున్నాయి. ఒకసారి సబర్మతి, థేమ్స్ నది చూసిన వారు ఈ మాట అనరు అని అంటున్నారు. మూసీ విషయంలో రాజకీయంగా కొంత నష్టం జరిగే పరిస్థితి ఉన్నా సీఎం రేవంత్ ముందుకు వెళుతుండడానికి కారణాలు ఉన్నాయి. మూసీ ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడూ ప్రక్షాళన జరగదు. సంఘర్షణ ఎలా ఉన్నా ముందుకే అంటున్నారు. ప్రస్తుతం మూసీ ప్రక్షాళన నేపథ్యంలో మనకు వినిపిస్తున్న పేర్లు సబర్మతి, థేమ్స్. ఈ రెండింటినీ సీఎం రేవంత్ సహా చాలా మంది ఎగ్జాంపుల్ గా చూపిస్తున్నారు. అయితే అక్కడ ఏం చేస్తే ఆ రెండు నదులు బాగుపడ్డాయో ఎవరికీ పెద్దగా తెలియదు. ఇప్పుడు మనం ఆ ప్రయత్నం చేయబోతున్నాం. ఒక దశలో మురికి కూపంగా మారి, జీవం కోల్పోయి ఇక ఎందుకూ పనికి రాదు అనుకున్న సమయాల్లో అద్భుతాలు ఎలా జరిగాయో చూద్దాం. ఆ నదులకు రాజయోగం పట్టి., మహర్దశ రావడానికి ఎన్నెన్ని సంఘర్షణలు జరిగాయో చూపిస్తాం. పాలకుల గట్టి సంకల్పం ద్వారా సాధ్యమైందో తెలుసుకుందాం. మూసీని ఇప్పుడు బాగు చేద్దామనుకుంటే ఎన్ని ఆటంకాలు వస్తున్నాయో అందరూ చూస్తున్నదే. కానీ సబర్మతి, థేమ్స్ నదుల తలరాత ఎలా మారిందో చూస్తే అందరి కళ్లు తెరుచుకోవడం ఖాయం. సీఎం రేవంత్ పదే పదే సబర్మతి గురించి చెబుతున్నారు. అదే విషయం ఎందుకు గుర్తు చేస్తున్నారని అంతా అనుకోవచ్చు. కానీ అది తెలుసుకోవడం అందరి బాధ్యత కూడా. అహ్మదాబాద్ మధ్యగా ప్రవహించే సబర్మతి నది. ఒకప్పుడు అచ్చం మన మూసీ నది మాదిరిగానే ఉండేది. మన హైదరాబాద్ లో ఎలాగైతే మూసీ మధ్య నుంచి ప్రవహిస్తుందో అలాగే అక్కడ కూడా. కానీ సబర్మతి దశ మాత్రం తిరిగిపోయింది. కాదు కాదు దశ తిప్పేశారు. సంకల్పం గట్టిదైతే పని జరుగుతుంది. మోడీ అనుకున్నారు. సబర్మతిని అందమైన నదిగా మార్చేశారు. మన దగ్గర కూడా మూసీ నది దశ మార్చాలని సీఎం రేవంత్ రెడ్డి గట్టి పట్టుదలతో ఉన్నారు. నదితో పని ఏముంది. ఏం వస్తుంది అనుకోవద్దు. జల వనరుల చుట్టూనే నాగరికత ఉంటుంది. పల్లెలైనా, పట్టణాలైనా, నగరాలైనా ఏదో ఒక నది, చెరువు ఆదరువుగా ఏర్పడ్డవే, విస్తరించినవే. నీటిని, పర్యావరణాన్ని వేరు చేసి చూడలేం. అందుకే అంత ప్రాధాన్యం. ఇదే అందరూ అర్థం చేసుకోవాల్సిన విషయం. ఒకసారి సబర్మతి దగ్గరికి వెళ్దాం. మన మూసీ మాదిరే ఆ నది కూడా ఒక దశలో మురికికూపంగా మారిపోయింది. జీవం కోల్పోయింది. చుట్టూ అపరిశుభ్రత, చెత్త వాతావరణం. వీటికి తోడు ఆక్రమణలు. మురుగునీటి వ్యర్థాలు. ఒక్కటేమిటి ఇప్పుడు మన మూసీ ఉన్నట్లుగానే సబర్మతి కూడా ఉండేది. నదికి నగరానికి లింక్ తొలగిపోతే ఎలా ఉంటుందో.. ఒకప్పుడు సబర్మతి చూస్తే అర్థమవుతుంది. నీళ్లు లేక క్రికెట్ గ్రౌండ్ గా, సర్కస్ లకు వేదికగా అయింది సబర్మతి. అలాంటి దశ నుంచి మొత్తం కథ మార్చేశారు మోడీ. సబర్మతి రివర్ ఫ్రంట్ ఒక సంకల్పంతో మొదలైంది. మొదట్లో అది పగటి కలే అనుకున్నారంతా. ఒక అడుగు ముందుకు పడితే మూడడుగులు వెనక్కు పడుతుందన్నారు. అయ్యేది కాదు పోయేది కాదన్నారు. కానీ అసాధ్యం సుసాధ్యమైంది. సబర్మతి రివర్ ఫ్రంట్.. కథ 1990ల నాటిది. 1997లో అహ్మదాబాద్ మున్సిపల్ కార్పొరేషన్.. సబర్మతి రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ను ఏర్పాటు చేసింది. 2001లో నరేంద్ర మోడీ గుజరాత్ ముఖ్యమంత్రిగా తొలిసారి బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి సబర్మతీ రివర్ ఫ్రంట్ అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించుకున్నారు. ప్రపంచంలోనే అత్యంత వినూత్నమైన పట్టణ ప్రణాళిక ప్రాజెక్ట్‌గా దీన్ని రూపొందించాలని ఆయన కలలు కన్నారు. అయితే అనుకున్న వెంటనే ఇంత పెద్ద పని ఏదీ జరగదు కదా. అందరినీ ఒప్పించాలి. మెప్పించాలి. తరలించాలి. ఎంతో సంఘర్షణ.. ఇవన్నీ జరిగాయి. 2005 వరకూ ఇవే గొడవలు. సమస్యలు. కానీ 2005లో మాత్రం నిర్మాణాలు మొదలయ్యాయి. ఆక్రమణలు తొలగింపు మొదలు చేసిన పనులతో 2012 నాటికి సబర్మతికి ఒక రూపు వచ్చింది. వాటర్ ఫ్రంట్ సహా బ్యూటిఫికేషన్, గ్రీనరీ, చుట్టూ పార్కులు ఏర్పాటు చేశారు. ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. 2012లోనే ఇంటర్నేషనల్ కైట్ ఫెస్టివల్ సబర్మతీ తీరంలోనే మోడీ ఆధ్వర్యంలో నిర్వహించడంతో అంతర్జాతీయంగా టూరిజం మ్యాప్ లోకి ఈ నది వచ్చింది. మారిన సబర్మతి ఎలా ఉందో బాహ్య ప్రపంచమంతా చూసింది. ఇక సెప్టెంబర్ 17, 2014న చైనా అధ్యక్షుడి జిన్ పింగ్ సతీసమేతంగా సబర్మతి రివర్ ఫ్రంట్ ను చూసి అద్భుతమన్నారు. పర్యావరణ మెరుగుదల, సామాజిక మౌలిక సదుపాయాలు అలాగే స్థిరమైన అభివృద్ధి లక్ష్యంగా సబర్మతి రివర్ ఫ్రంట్ జనానికి అందుబాటులోకి వచ్చింది. నదికి రెండువైపులా గోడలు ఏర్పాటు చేశారు. వరదలు వస్తే లోతట్టు ప్రాంతాలు మునిగిపోకుండా తీర్చిదిద్దారు. అలాగే మురికి నీళ్లు, పారిశ్రామిక వ్యర్థాలు సబర్మతిలో కలవకుండా కొత్త సీవేజ్ ట్రీట్మెంట్ అలాగే, వరదనీటి ప్రవాహం కోసం మరిన్ని ఏర్పాటు చేశారు. దీంతో మురికి నుంచి సబర్మతికి విముక్తి కలిగింది. సబర్మతి రివర్ ఫ్రంట్ కల సాధ్యం చేయడానికి ఆక్రమణలకు గురైన 501 ఎకరాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ స్వాధీనం చేసుకున్న భూమిలో 85 శాతం లాండ్ ను ప్రజలకు మౌలిక సదుపాయాలు, వాకింగ్ ట్రాక్, పార్కులు వంటివి వాటికి కేటాయించారు. మరో 15 శాతం వాణిజ్య అవసరాలకు ఇచ్చారు. భూమిస్వాధీనం సమయంలో మూసీ మాదిరిగానే చాలా శక్తులు అడ్డు పడ్డాయి. కానీ వాటిని అధిగమించారు. ఆగష్టు 2022లో రివర్‌ఫ్రంట్‌ను మరింత ఆకర్షణీయంగా మార్చేలా పాదచారుల కోసం అటల్ బ్రిడ్జిని ప్రారంభించారు. ఈ ఫుట్ ఓవర్ బ్రిడ్జితో నది మధ్యలో నిలబడి నీటి ప్రవాహాన్ని చూసేలా తీర్చి దిద్దారు. అలాగే ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా సైక్లిస్టులు కూడా ఈ బ్రిడ్జిని ఉపయోగించు కుంటున్నారు. ఇవే కాదు సబర్మతి చుట్టూ రివర్ ఫ్రంట్ మార్కెట్, లాండ్రీ క్యాంపస్ వంటివి తెచ్చారు. వెండింగ్ ప్లాట్ ఫాంలు ఏర్పాటు చేయించారు. నగరంలో పచ్చదనం పెంచేందుకు ఎస్ఆర్ఎఫ్‌డీ ప్రాజెక్టు ద్వారా లక్ష మొక్కలు నాటారు. బ్యారేజీ కమ్ బ్రిడ్జి ప్రణాళికలతో ఎయిర్ పోర్టుకు అహ్మదాబాద్ లో ఒకచోటి నుంచి మరో చోటికి ఈజీగా వెళ్లేలా తీర్చి దిద్దారు. సబర్మతి రివర్ ఫ్రంట్ 120 కంటే ఎక్కువ స్థానిక అలాగే వలస, అరుదైన పక్షి జాతులకు ఆలవాలంగా మారింది. 45 వేల చెట్లు ఉన్నాయి. 11 కిలోమీటర్ల మేర పాదచారుల కోసమే ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. ఏ వెహికిల్ వచ్చి ఢీకొంటుందో అన్న టెన్షన్ లేదు. సబర్మతీ తీరానికి వెళ్తే నగరవాసికి చాలా రిలీఫ్ వచ్చేలా తీర్చి దిద్దారు. ఆధునిక భారతదేశంలో పట్టణ ప్రణాళిక, అభివృద్ధి హిస్టరీలో ఒక సక్సెస్ ఫుల్ ఎగ్జాంపుల్ ఏదైనా ఉందంటే అది సబర్మతి రివర్ ఫ్రంట్ మాత్రమే. అలాగే లండన్ థేమ్స్ నది కూడా ఇలాగే కొత్త రూపు సంతరించుకుంది. శతాబ్దాల చరిత్ర కలిగిన ఈ నది ఒకప్పుడు మురికి కూపంగా ఉండేది. పారిశ్రామికీకరణ ఊపందుకోవడం, నగర జనాభా పెరిగిపోవడంతో ఇంగ్లండ్ పట్టణాల మీదుగా ప్రవహించే థేమ్స్ నదిలో వ్యర్థాలు కలవడం పెరిగిపోయాయి. 1850ల్లో అయితే థేమ్స్ ఒడ్డున నిలబడే పరిస్థితి కూడా లేకుండా పోయింది. ఒకటే కంపు. ఇప్పుడు మన మూసీ ఉన్నట్లు. కానీ దాని సంకల్ప బలంతో దాని కథను మార్చేశారు పాలకులు సో అటు సబర్మతి, ఇటు థేమ్స్ ఈ రెండు ఎగ్జాంపుల్స్ చూశాక, ఆ నదులు ఇప్పుడు కళకళలాడుతున్న దృశ్యాలు చూశాకమూసీ మారడమా వద్దా అన్నది హైదరాబాదీలే నిర్ణయించుకోవాలి.

# యూపీఐ యూజర్లకు ఆర్‌బీఐ శుభవార్త

**యూపీఐ వాలెట్ లిమిట్‌ను రూ.2వేల నుంచి రూ.5వేలకు పెంపు**

ముంబై: యూపీఐ యూజర్లకు ఆర్‌బీఐ శుభవార్త చెప్పింది. జఖఎ 123ఖజీఎ లావాదేవీల పరిమితిని రూ.5వేల నుంచి రూ.10వేలకు, యూపీఐ వాలెట్ లిమిట్‌ను రూ.2వేల నుంచి రూ.5వేలకు పెంచుతున్నట్లు ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ బుధవారం ప్రకటించారు. ఎంపీసీ సమావేశం అనంతరం శక్తికాంత దాస్ మాట్లాడారు. డిజిటల్ చెల్లింపులను పెంచడం, చిన్న లావాదేవీలపై యూపీఐ లైట్‌ని ఉపయోగించే వారికి సౌకర్యాలను విస్తరించడమే పరిమితి పెంచడానికి ప్రధాన లక్ష్యమన్నారు. డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించేందుకే ఆర్‌బీఐ ఈ నిర్ణయం తీసుకుందని మార్కెట్ వర్గాలు సైతం పేర్కొంటున్నాయి. కోటక్ సెక్యూరిటీస్ ప్రకారం.. వినియోగదారులకు కోసం ఆర్‌బీఐ ఈ నిర్ణయం తీసుకుందని.. యూజర్లు స్వాగతించాలన్నారు. డిజిటల్ చెల్లింపుల ప్రయోజనాన్ని పెంచడం, చిన్న లావాదేవీల కోసం యూపీఐ లైట్ వాలెట్‌ని ఉపయోగించే జఖఎ లైట్ వాలెట్‌ను ఉపయోగించే వారికి మరింత సౌకర్యాన్ని అందించడం ప్రధాన లక్ష్యం. ఇది డిజిటల్ లావాదేవీల ప్రక్రియను మరింత వేగవంతం చేస్తుందని పేర్కొంది. యూపీఐ లైట్ వాలెట్ పరిమితిని రూ. 2వేల నుంచి రూ. 5 వేలకు పెంచడంతో చిన్నపాటి విలువైన లావాదేవీలు సులభతరం కానున్నాయి. యూపీఐ లైట్ అకౌంట్‌లో యాడ్ చేసుకోవచ్చు. ప్రతి లావాదేవీకి బ్యాంక్ సర్వర్ నుంచి యాక్సెస్ లేకుండానే చెల్లింపులు చేసేలా సులభతరం కానున్నది. రోజువారీ చెల్లింపులను సులభతరం చేయనున్నది. జఖఎ 123ఖజీఎ లావాదేవీల కోసం నాలుగు పద్ధతులను అందించనున్నది. యూపీఐ 123పే అనేది ఏకీకృత చెల్లింపుల ఇంటర్‌ఫేస్‌ను సురక్షితమైన పద్ధతిలో ఉపయోగిస్తుంటారు. ఫీచర్ ఫోన్ వినియోగదారుల కోసం తక్షణ చెల్లింపుల వ్యవస్థ. యూపీఐ123ఖజీఎ ద్వారా, ఫీచర్ ఫోన్ వినియోగదారులు ఐవీఆర్ (ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్) నంబర్స్, ఫీచర్ ఫోన్‌లలో యాప్ ఫంక్షనాలిటీ, మిస్డ్ కాల్ ఆధారిత విధానం, సౌండ్ ఆధారిత సిస్టమ్‌కి కాల్ చేయడం ద్వారా లావాదేవీలు జరిపే సదుపాయం ఉన్నది. ప్రస్తుతం 12 భాషల్లో అందుబాటులో ఉన్నది. యూపీఐ లైట్ ఎం-పిన్ ఎంటర్ చేయాల్సిన అవసరం లేకుండానే యూపీఐ పేమెంట్స్ చేసేందుకు యూపీఐ లైట్ సేవలు ఉపయోగపడనున్నాయి.

# జిల్లాకు చేరిన సీఎం కప్ క్రీడాజ్యోతి

కరీంనగర్: గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం నవంబర్ లో సీఎం కప్ పోటీలు నిర్వహిస్తుందని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. సీఎం కప్ క్రీడోత్సవాలకు సంబంధించిన క్రీడాజ్యోతి ర్యాలీ బుధవారం కరీంనగర్ కు చేరుకుంది. క్రీడాజ్యోతి ర్యాలీకి కమాన్ వద్ద కలెక్టర్, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, సీపీ అభిషేక్ మహంతి, అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, నగరపాలిక కమిషనర్ చాహత్ భాజ్ పేయి, యువజన క్రీడల అధికారి శ్రీనివాస్ ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ. ర్యాలీ యొక్క ముఖ్య ఉద్దేశం త్వరలో జరగబోయే సీఎం కప్ గురించి ప్రజల్లో అవగాహన కల్పించి పట్టణ, గ్రామీణ ప్రాంతాల నుండి ఎక్కువ క్రీడాకారులు పాల్గొనే విధంగా అవగాహన కల్పించడమే ముఖ్య లక్ష్మని అన్నారు. అలుగునూర్ చౌరస్తా నుండి కమాన్ మీదుగా అంబేద్కర్ స్టేడియం వరకు అట్టహాసంగా సుమారు 800 మంది క్రీడా భిమానులతో క్రీడాజ్యోతి ర్యాలీ కమాన్ నుంచి అంబేద్కర్ స్టేడియం వరకు సాగింది. ఈ కార్యక్రమంలో డీ ఆర్ఓ పవన్ కుమార్, ఆర్డిఓ మహేశ్వర్, జిల్లా ఉన్నతాధికారులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సామాన్య ప్రజలు సైబర్ నేరగాళ్ల వలలో పడకండి

**సైబర్ డీఎస్పీ ప్రశాంత్ రెడ్డి**

వికారాబాద్: వికారాబాద్ జిల్లా కేంద్రంలోని క్లబ్ ఫంక్షన్ హాల్లో వయో? వృద్ధులకు సైబర్ నేరాల పట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించిన సైబర్ క్రైమ్ బ్యూరో డీఎస్పీ ప్రశాంత్ రెడ్డి
అనంతరం వారు మాట్లాడుతూ ఈ మధ్య కాలంలో సైబర్ నేరగాళ్లు ఎక్కువ శాతం వృద్ధులనే టార్గెట్ చేస్తున్నారని ఎందుకెటే తమ అకౌంట్లో ఎక్కువ డబ్బులు కూడబెట్టేది వృద్ధులేనని అందుకే వారినేఎక్కువ టార్గెట్ చేస్తున్నారని తెలిపారు. అందుకని ఎవరైనా తెలియని వ్యక్తుల పోన్ నంబర్సతో పోన్ చేసిన మెసేజ్ చేసిన వీడియో కాల్ చేసిన ఎవరు కూడ పోన్లు తీయకండి అని తెలిపారు. మరెన్నో రకాలుగా మీ పిల్లల పేర్లు చెప్పి మీ ఆదార్ నంబర్ చెప్పిన మీ పిల్లలు ఆపదలో ఉన్నారని చెప్పిన మేము పోలీసులమని వీడియో కాల్ చెసి బెదిరించిన ఎవరు కూడా బయపడకండి అని మీ పోన్ కు ఒటీపిలు, పిన్ నంబర్లు వచ్చిన వాటిని చెప్పోదన్నారు. పోలీసులు మరియు బ్యాంక్ అదికారులు ఎప్పుడు కూడా వీడియో కాల్ చెయరని తెలిపారు. ఏటీఎంలలో కూడా తెలియని వ్యక్తులతో డబ్బులు తీయించుకోడద్దని తెలిపారు. మీకు ఎక్కువగా బయబ్రాంతలకు గురిచేస్తే మీ పిల్లలకు గాని లేదా పోలీసులకు లేదా 1930 నవంబర్ కు సమాచారం ఇవ్వండి అని ఎవరు కూడా సైబర్ నేరగాల్ల పట్ల జాగ్రత్తగా ఉండలని తెలిపారు.

# డీఎస్సీ అభ్యర్థుల నియామక పత్రాలు

**సమావేశానికి బయలుదేరిన అభ్యర్థులు**

**బస్సులను జెండా ఊపి ప్రారంభించిన జిల్లా అదనపు కలెక్టర్ పి, రాంబాబు**

జగిత్యాల: హైదరాబాదు లోని ఎల్ బి స్టేడియం లో బుధవారం జరుగనున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశానికి జగిత్యాల జిల్లా లో నూతనంగా ఎన్నికైన 269 మంది అభ్యర్థులను డి,ఎస్సీ- 2024 అభ్యర్థులకు అపాయింట్ మెంట్ ఆర్డర్ లను తీసుకునేందుకు 7 ఆర్టీసీ బస్సులను జిల్లా కలెక్టర్ కార్యాలయం నుండి అదనపు కలెక్టర్ రాంబాబు జెండా ఊపి ప్రారంభించారు...ఒక్కొక్క బస్ లో విద్యాశాఖ నుండి ఇద్దరు మండల విద్యాధికారులు ఒక లైసన్ అధికారులు ఒక పోలీసు,మరియు వైద్య శాఖ నుండి ఒక అధికారిని బస్సులను వారి వెంట పంపించడం జరిగిందని అదనపు కలెక్టర్ తెలిపారు.. .ఈ సంధర్భంగా ఎంపికైన అభ్యర్థులకు ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విద్యాధి కారి జగన్ మోహన్ రెడ్డి,ఏవో, బి డబ్ల్యు ఓ అధికారులు,నరేష్,బిసి,ఎస్సీ, అధికారులు, సాయిబాబా, రాజు కుమార్, మైనార్టీ అధికారి, చిత్రు,తదితరులు పాల్గొన్నారు.

# అక్రమంగా పెట్టిన కేసులు ఎత్తివేయాలి..



కొనరావుపేట : గత ప్రభుత్వంలో అక్రమంగా పెట్టిన కేసులు ఎత్తివేయాలని కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఎల్లయ్య యాదవ్ అన్నారు. ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం చేసే ప్రజా వ్యతిరేక విధానాల కోసం దిష్టిబొమ్మలు తగలబెడితే అప్పటి ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టిందని అప్పటినుండి ఇప్పటివరకు కోర్టుల చుట్టూ తిరుగుతున్నాము. పండుగ పూట కూడా కోర్టులో కేసు ఉండడంతో పండగకు కుటుంబీకులతో ఉండే వాళ్ళం నేడు కోర్టులో ఉండాల్సి వచ్చిందని, వెంటనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గతంలో పెట్టిన కేసులు ఎత్తివేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆయన వెంట మండల కాంగ్రెస్ నాయకులు రాస రవీందర్ రెడ్డి, మాందాల లింబయ్య, మస్కూరి కాశీరాం, ముదాం ప్రదీప్, పాతకాల ప్రకాష్, దండేం అశోక్ లు ఉన్నారు.

Editor,Printer, Publisher & Owner by **Reddy Shekar**,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48
**SS Printers,** (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, **E Mail : teenmaardesk@gmail.com, Cell : 9177108128**